ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఏపీసీఎల్‌సీ)

8వ రాష్ట్ర మహాసభలు

కర్నూలు.

(నర్రా ప్రభాకరరెడ్డి నగర్)

11, 12, 13 డిసెంబర్, 1993

<u>ప్రధాన కార్యదర్శి నివేదిక</u>

(ముసాయిదా)

నర్రా ప్రభాకరరెడ్డి నగర్‌లో జరుపుకుంటున్న ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం 8వ రాష్ట్ర మహాసభలకు హాజరయిన ప్రతినిధులకు సంస్థ కార్యవర్గం తరపున ఆహ్వానం పలుకుతున్నాను.

కరీంనగర్‌లో 7వ రాష్ట్ర మహాసభలు 1991 ఏప్రిల్ 27 - 28 తేదీలలో జరుపుకున్నాము. 1987 నుండి రెండు సంవత్సరాలకు ఒకసారి జరుపుకుంటున్న రాష్ట్ర మహాసభలను ఈసారి ఇంకొంచెం ఆలస్యం చేసి రెండు సంవత్సరాల ఏడున్నర నెలల తరువాత జరుపుకుంటున్నాం. మహాసభలలోపల సంస్థ నిర్మాణాన్ని పటిష్టం చేసుకోవాలన్న ఉద్దేశంతో ఏప్రిల్‌లో జరగవలసిన మహాసభలను డిసెంబర్‌లో జరుపుకుంటున్నాము.

ఏపీసీఎల్‌సీ ఏర్పడి 20 సంవత్సరాలు గడిచాయి. సంస్థ లక్ష్య ప్రకటనను ఆమోదించి 13 సంవత్సరాలు గడిచాయి. ఈ లక్ష్య ప్రకటనను ఆధారం చేసుకొని మనం కార్యక్రమాలు నిర్ణయించుకొని పనిచేసే క్రమంలో పౌరహక్కుల గురించి మన అవగాహనను రూపొందించుకుంటున్నాము.

<u>పౌరహక్కుల ఉద్యమం</u> :-

భారత సమాజం అనేక రకాల అణచివేతకూ, అస్వతంత్రమయిన ప్రజాస్వామ్య చైతన్యానికీ నిలయం. సంప్రదాయకమైన అణచివేత రూపాలు భూమి యాజమాన్యంలో అసమానత, ఆదివాసీల జీవనంపైన నాగరికుల దాడులు, కులవ్యవస్థ, వర్ణ ధర్మం, పురుషాధిక్యత, రకరకాల రూపాల శ్రమదోపిడీ బ్రిటిష్ వలసపాలనతో పెట్టుబడిదారీ శ్రమదోపిడీ వలసదోపిడీ వీటికి తోడయ్యాయి. ఇవన్నీ కలగలిసి ఈనాడు వివిధ రూపాలలో కొనసాగుతున్నాయి.

సంప్రదాయక అణచివేత రూపాలకూ అసమానతకూ వ్యతిరేకంగా భారతదేశంలో అనేక పోరాటాలు జరిగాయి. ఇప్పటికీ జరుగుతున్నాయి. ఈ పోరాటాలనుండి పుట్టిన ప్రజాస్వామ్య చైతన్యానికి విలువలకూ పాశ్చాత్య ప్రజాతంత్ర పోరాటాలలో పుట్టిన విలువలు, హక్కులు, చైతన్యం తోడయ్యాయి. వివిధ రాజకీయ సిద్ధాంతాలు, ఉద్యమాలద్వారా ఈ చైతన్యం మన చైతన్యంలో భాగమయింది.

ప్రజల చైతన్యంలో ఉన్న హక్కులను, ప్రజాతంత్ర విలువలను సాధించుకోవడానికి కావలసిన మద్దతు ఇవ్వడం; సాధించుకున్న హక్కుల, విలువల వ్యవస్థీకరణ సక్రమంగా జరిగేటట్టు చూడడం; వ్యవస్థీకృత హక్కులు, విలువలు నిజానికి ప్రజలకు అందేటట్టు చూడడం; అవి పీడిత ప్రజలకు వ్యతిరేకంగా పీడక వర్గాలకు ఉపయోగపడితే ప్రతిఘటించడం; సాధించుకున్న హక్కులను, విలువలను రక్షించుకోవడానికీ విస్తరించుకోవడానికీ కృషిచేయడం; ఇవి పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యాలు.

హక్కులు జీవించడానికి అవసరం, జీవితాన్ని మెరుగు పరచుకోవడానికి అవసరం. హక్కులు వాటంతటవే విలువయినవేకాక అణచివేతను ప్రతిఘటించడానికీ జీవితాన్ని మెరుగు పరచుకోవడానికి సాధనాలు కూడ.

అణచివేతకూ అస్వతంత్రతకూ పీడనకూ ఆధిపత్యానికీ గురి అయ్యే ప్రజలకు గల పోరాడే హక్కు, ఆ హక్కు ఎదుర్కొనే ఆటంకాలు పౌరహక్కుల ఉద్యమ ఆచరణకు ఒక ముఖ్యమయిన విషయం. ఆ పోరాటాల ఫలితంగా వచ్చిన హక్కుల వ్యవస్థీకరణ, వాటి అమలు మరొక ముఖ్యమయిన విషయం.

ఉద్యమించే హక్కుకు ప్రత్యక్షమైన అణచివేత ఒక శత్రువు. పోలీసు తదితర ప్రభుత్వ సాయుధబలగాల నిర్బంధం, అప్రజాస్వామిక చట్టాలు, బలవంతుల దౌర్జన్యాలు, ప్రజా ఉద్యమాలను అణచివేస్తాయి. ఈ అణచివేతను వ్యతిరేకించడం పౌరహక్కుల ఉద్యమానికి ఉండే ఒక ముఖ్య కర్తవ్యం. ఉద్యమాల రాజకీయాలతో నిమిత్తం లేకుండ అణచివేతను పౌరహక్కుల ఉద్యమం వ్యతిరేకిస్తుంది.

పాలకులు ఉద్యమాల లక్ష్యాలనూ ఆకాంక్షలనూ వక్రీకరించి తమ అణచివేతకూ నిర్బంధానికీ ఆమోదం పొందాలని చూస్తారు. ఉద్యమ ఆకాంక్షలలోని ప్రజాతంత్ర అంశాన్ని గుర్తించడానికి నిరాకరిస్తారు. నిర్బంధంతో పాటు ఈ వక్రీకరణనుకూడ పౌరహక్కుల ఉద్యమం వ్యతిరేకిస్తుంది. ఉద్యమ రాజకీయపంథా ఏదయినప్పటికీ ఉద్యమ ఆశయంలోని ప్రజాతంత్ర అంశాలను పౌరహక్కుల ఉద్యమం సమాజంముందు నిలబెడుతుంది. పౌరహక్కుల ఉద్యమం ఏ రాజకీయ పంథాను సమర్థించదు. అయితే ఉద్యమ సిద్ధాంతాలలో ఆశయాలలో ఉన్న ప్రజాతంత్ర అంశాలకు మద్దతు ఇస్తుంది.

ఉద్యమించే హక్కుకు ప్రత్యక్ష నిర్బంధమేకాక అప్రజాస్వామిక సామాజిక వ్యవస్థ, సంస్కృతి కూడ శత్రువులే. వాటిని కూడ పౌరహక్కుల ఉద్యమం వ్యతిరేకిస్తుంది. కులవ్యవస్థ, పితృస్వామ్య వ్యవస్థ, బ్రాహ్మణీయ భావజాలం, సామ్రాజ్యవాద సంస్కృతి పీడిత ప్రజలపైన ప్రత్యక్షమైన అణచివేత ప్రయోగించడమేకాక ప్రజాతంత్ర చైతన్యానికీ ఆచరణకూ ఆటంకంగా నిలుస్తాయి. ఉద్యమ చైతన్యానికి ఆటంకమవుతాయి.

ఉద్యమించి, పోరాడి సాధించుకున్న హక్కులు, ప్రజాతంత్ర విలువలు వ్యవస్థీకృతమయినప్పుడు శాసన రూపం తీసుకుంటాయి. ఇది దేశ శాసనాలలో ఉన్న ప్రజాతంత్ర అంశం. దీనికి శాసనంలోనే ఎన్నో పరిమితులు ఉంటాయి. మినహాయింపులుంటాయి. పోరాట ఆకాంక్ష ఎంతపెద్దదో దానిని అంతగా కుదించి వ్యవస్థీకరించాలని పాలకులు ప్రయత్నిస్తారు. ఈ ప్రయత్నాన్ని పౌరహక్కుల ఉద్యమం వ్యతిరేకిస్తుంది.

శాసనాలలో వ్యవస్థీకరించిన హక్కులను ఆచరణలో అతిక్రమించడానికి పాలకులు పోలీసులనూ ఇతర ప్రభుత్వ సిబ్బందినీ వాడుకుంటారు. చట్టాన్ని గౌరవించనవసరం లేదన్న అలిఖిత ఆదేశాలేకాక కొన్ని చట్టాలను గౌరవించకపోవడం అనే అనివార్యత కూడా ఉంటుంది. వీటిని పౌరహక్కుల ఉద్యమం వ్యతిరేకిస్తుంది. ప్రతిఘటిస్తుంది. న్యాయం కోసం పోరాడుతుంది. న్యాయస్థానాలలో, న్యాయ స్థానాలబయట దీనికోసం కృషిచేస్తుంది. న్యాయస్థానాలు ప్రజాతంత్ర ప్రమాణాలకు భంగకరంగా

వ్యవహరిస్తే పౌరహక్కుల ఉద్యమం వ్యతిరేకిస్తుంది. హక్కులను వాస్తవంగా ప్రజలకు అందజేసే కర్తవ్యాన్ని న్యాయస్థానాలు నిర్వర్తించాలని పోరాడుతుంది.

ప్రజాస్వామ్య హక్కులనూ విలువలనూ వ్యవస్థీకరించే చట్టాలకే 'రెండువైపులా పదును' ఉంటుంది. అవి ప్రజలకు తమ జీవితాన్ని నిండుగా అనుభవించడానికే ఇంకా మెరుగైన జీవితం పొందడానికే ఉపయోగపడతాయి. అదే సమయంలో ప్రజలకు వ్యతిరేకంగా ప్రభుత్వానికీబలవంతులకూ ఉపయోగపడతాయి. సహజన్యాయసూత్రాలు, చట్టపరమయిన సమ దృష్టి, న్యాయవ్యవస్థకు సంబంధించిన ప్రజాస్వామ్య విలువలు అవి ప్రజలకూ ఉపయోగపడ్డాయి. ప్రజలకు వ్యతిరేకంగా ఆస్తి పరులకూ పెత్తందార్లకూ కూడా ఉపయోగపడ్డాయి. భూసంస్కరణలను వ్యతిరేకించడానికే రిజర్వేషన్లను వ్యతిరేకించడానికే ఈ విలువలనే ఉటంకించారు. ప్రజాస్వామ్య హక్కులు, విలువల వ్యవస్థీకరణలో ఉండే ఈ ద్వంద్వ స్వభావం పట్ల పౌరహక్కుల ఉద్యమం అప్రమత్తంగా ఉంటుంది. విలువల సారాంశాన్ని కాపాడుతూ వాటి వ్యవస్థీకరణలోని వక్రీకరణను విమర్శిస్తుంది. వ్యతిరేకిస్తుంది. బలహీన వర్గాలపట్ల ప్రభుత్వానికి ఉండే 'సంరక్షణ' బాధ్యత దీనికి ఒక ఉదాహరణ. ఆ బాధ్యత అవసరం. అదొక ప్రజాస్వామ్య సంప్రదాయం అయితే ఆ పేరుమీద ఆ ప్రజలకు తమ భవితవ్యాన్ని తాము నిర్ణయించుకునే అవకాశాన్నీ స్వేచ్ఛనూ ప్రభుత్వం లేకుండ చేస్తే పౌరహక్కుల ఉద్యమం వ్యతిరేకిస్తుంది.

హక్కుల అతిక్రమణ దేశ సామాజిక ఆర్థిక రాజకీయ వ్యవస్థలోని వ్యవస్థీకృత ఆధిపత్యం నుండి పుడుతుంది. రాజ్యాంగయంత్రం, ఆస్తి, కులవ్యవస్థ, పురుషాధిక్య వ్యవస్థ మొదలయినవి మన సమాజంలో హక్కుల నిరాకరణకూ అతిక్రమణకూ మూలమయిన ఆధిపత్యవ్యవస్థలు. ఇవి పరస్పర ఆధారితమయిన వ్యవస్థలు. రాజ్యాంగ యంత్రం ఆధిపత్యానికి అవసరమయిన భావజాలాన్ని సభ్యసమాజంలోని వ్యవస్థలు కాపాడుతుండగా సభ్యసమాజంలోని ఆధిపత్య వ్యవస్థలను రాజ్యాంగ యంత్రం తన బల ప్రయోగంతో కాపాడుతుంది.

ఉద్యమాలపైన జరిగే అణచివేతతో పాటు నిత్య జీవితంలో పై నాలుగు ఆధిపత్య వ్యవస్థల వల్ల అమలయ్యే అణచివేతను పౌరహక్కుల ఉద్యమం వ్యతిరేకిస్తుంది. పోలీసు హింస, ఇతర ప్రభుత్వ సంస్థలు ప్రయోగించే అణచివేత, దళితులపైన కుల వివక్ష, అగ్రకుల హింసాకాండ, ఫ్యాక్టరీలలో కార్మికులపైన అణచివేత, ఇంటాబయటా స్త్రీలపైన మగవాళ్ళు ప్రయోగించే హింస, ఉద్యమాలతో నిమిత్తం లేకుండ నిత్యం అమలవుతుంటాయి. చట్టాలతో శాసనాలతో నిమిత్తం లేకుండా ప్రజలకు వివిధ ప్రకృతి వనరులమీద, జీవనాధార మయిన ప్రకృతి సంపదమీద సంప్రదాయిక హక్కులుంటాయి. వీటికి శాసన రూపం ఇవ్వాలని పౌరహక్కుల ఉద్యమం కృషిచేస్తుంది. ఆధునీకరణ పేరిట ప్రగతిపేరిట వీటిని సంప్రదాయికంగా అనుభవిస్తున్న ప్రజలకు లేకుండ చేసి ప్రభుత్వం చేతిలో, పెట్టుబడిదార్ల చేతిలో పెట్టడాన్ని పౌరహక్కుల ఉద్యమం వ్యతిరేకిస్తుంది.

చరిత్ర క్రమంలో వివిధ దేశకాలాలలో జరిగిన ప్రజాతంత్ర పోరాటాలనుండి హక్కులే కాక అనేక ప్రజాతంత్ర విలువలు, సంప్రదాయాలు సామాజిక రాజకీయ జీవితంలోకి వచ్చాయి. ఒక దేశంలో ప్రజాతంత్ర పోరాటాలలో పుట్టిన విలువలు రాజకీయ సిద్ధాంతాల ద్వారా, ఉద్యమాలద్వారా ఇతర దేశాలకు పాకుతాయి. అక్కడి నిర్దిష్ట పరిస్థితిలో నిర్దిష్ట రూపం తీసుకుంటాయి. అటువంటి ఒక ప్రజాతంత్ర విలువ లౌకికవాదం. లౌకికవాదం అంటే సామాజిక రాజకీయ ఆర్థిక రంగాలపైన మత నియంత్రణను తిరస్కరించి ప్రజాతంత్ర విలువలను దానిస్థానంలో ప్రతిపాదించడం. భారతదేశంలో మతనియంత్రణ అనేది కులవ్యవస్థతోనూ బ్రాహ్మణీయ భావజాలంతోనూ ముడిపడి ఉంది. లౌకిక వాదాన్ని కాపాడడానికి పౌరహక్కుల ఉద్యమం కృషిచేస్తుంది. అన్నిరకాల మతోన్మాదాన్నీ వ్యతిరేకిస్తుంది. అయితే హిందూ మతోన్మాదాన్ని భారతదేశంలో లౌకిక వాదానికి ప్రధాన శత్రువుగా గుర్తిస్తుంది. మైనారిటీల హక్కులపైన, అస్తిత్వంపైన జరిగే దాడులను వ్యతిరేకిస్తుంది. మతపరమయిన మైనారిటీల హక్కులనే కాక భాష, జాతి పరమయిన మైనారిటీల హక్కులను కూడ కాపాడడానికి కృషిచేస్తుంది.

దేశ పరిపాలనలో ప్రజాభీష్టం వ్యక్తం కావాలి, ప్రభుత్వం ప్రజలకు జవాబుదారు కావాలి అనేది మరొక ముఖ్యమయిన ప్రజాతంత్రవిలువ. ఇది లేకపోతే దేశాన్ని ప్రజాస్వామ్యం అనడంలో అర్థంలేదు. ఎన్నికలలో అక్రమాలు, పరిపాలనలో అవినీతి, అక్రమ సంపాదన ప్రజాతంత్ర రాజకీయ వ్యవస్థకే భంగకరమని పౌరహక్కుల ఉద్యమం భావిస్తుంది. పాలకులు ప్రజాభీష్టానికి కాక పెత్తందార్ల అవసరాలకూ విదేశీద్రవ్య సంస్థల ఆదేశాలకూ నిబద్ధం కావడం ప్రజాస్వామ్య మూలసూత్రాలకు విరుద్ధమని భావిస్తుంది.

భారత జాతీయోద్యమంతో పాటు జరిగిన అనేక ప్రజాతంత్ర పోరాటాల ఫలితంగా భారత రాజ్యాంగం ప్రభుత్వానికి పరిపాలించే బాధ్యతేకాక అనేక ఇతర బాధ్యతలు పెట్టింది. ఆదేశిక సూత్రాలలో బాధ్యతలను రాజ్యాంగం ఏకరువుపెట్టింది . ఆ బాధ్యతలను ప్రభుత్వం వాస్తవంగా నిర్వర్తించాలని పౌరహక్కుల ఉద్యమం అంటుంది. వైఫల్యాలు సంభవించినప్పుడు నిలదీస్తుంది. కరువు, కాలుష్యం, నిరుద్యోగం, నిరాశ్రయత, ఆకలిచావులు, అప్పులచావులు ఆ వైఫల్యంనుండి పుట్టాయని గుర్తిస్తుంది.

ఆర్థిక రంగంలో ప్రభుత్వం అనుసరించే విధానాలు దేశంలో హక్కుల అతిక్రమణకు నేపథ్యంగా పనిచేస్తాయి. ఆ విధానాలు ప్రజల హక్కులనూ ప్రజాతంత్ర విలువలనూ వెనక్కి తీసుకుపోయే దిశలో ఉంటే పౌరహక్కుల ఉద్యమం వ్యతిరేకిస్తుంది. 'సామాజిక ఆర్థిక రాజకీయన్యాయం' అనే లక్ష్యాన్ని ప్రమాణంగా పెట్టుకొని ప్రభుత్వ విధానాలను విమర్శిస్తుంది.

అణచివేతనూ అస్వతంత్రతనూ వ్యతిరేకించే పౌరహక్కుల ఉద్యమం ఏ ఒక్క రాజకీయ సిద్ధాంతానికీ నిబద్ధం కాకుండ విశాలమయిన ప్రజాతంత్ర ప్రాతిపదికమీద నిర్దిష్ట విషయాలపట్ల తన అవగాహననూ ఆచరణనూ రూపొందించుకుంటుంది. ప్రజల హక్కులనూ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలనూ జీవనాన్నీ, సమాజంలో ప్రజాతంత్ర విలువలనూ ముందుకు తీసుకొనిపోయే రాజకీయ ఉద్యమాలనూ సిద్ధాంతాలనూ ప్రజాతంత్ర రాజకీయ ఉద్యమాలుగా సిద్ధాంతాలుగా గుర్తిస్తుంది. ఆ ఉద్యమాలనుండి, సిద్ధాంతాలనుండి పుట్టిన ప్రజాతంత్ర భావాలనూ విలువలనూ ఆకళింపు చేసుకొని తన అవగాహనలో అంతర్భాగం చేసుకుంటుంది. ఆ ప్రాతిపదికమీద తనదయిన అవగాహన పెంపొందించు కుంటుంది. తన స్వతంత్ర అవగాహననూ అస్తిత్వాన్నీ కాపాడుకుంటూ ప్రజాతంత్ర ఉద్యమ స్రవంతిలో ఒక ఉద్యమంగా పనిచేస్తుంది.

## కరీంనగర్ మహాసభల తరువాత

అ

1991 ఏప్రిల్ తరువాత రాష్ట్రంలో జరిగిన ప్రముఖ పౌరహక్కుల సంఘటనలు : నర్రా ప్రభాకరరెడ్డి హత్య, చుండూరు మారణకాండ, వివిధ జిల్లాలలో వందమందికి పైగా చేనేత కార్మికుల ఆకలిచావులు, విపరీతంగా పెరిగిపోయిన ఎన్‌కౌంటర్లలో భాగంగా పత్రికా విలేకరి గులాం రసూల్ హత్య, పీపుల్స్‌వార్ గ్రూపు, ఆ గ్రూపు అనుబంధ సంస్థలపైన నిషేధం, సారాయి నిషేధం తరువాత కల్తీ సారాతాగి మెదుకూరులో 31 మంది, అల్వాల్‌లో 17 మంది మరణం.

బహుశా నంద్యాలలో పి.వి.నరసింహారావు ఎన్నికను కూడా ఈ జాబితాలో చేర్చాలేమో.

### నర్రా ప్రభాకర రెడ్డి హత్య :-

ఏపిసిఎల్‌సి వరంగల్ జిల్లా శాఖ కన్వీనర్లలో ఒకరైన నర్రా ప్రభాకరరెడ్డిని 1991 డిసెంబరు 7వ తేదీన పోలీసులు హనుమకొండలోని తన ఇంటిలోనే కాల్చేసారు. డాక్టర్ రామనాథం హత్య అనంతరం నాలుగేళ్ళు స్తబ్దంగా ఉన్న వరంగల్ జిల్లా శాఖను పునరుద్ధరించడానికి ధైర్యంగా ముందుకు వచ్చిన వ్యక్తి నర్రా ప్రభాకరరెడ్డి. నర్మెట్ట మండలం వెల్దండ గ్రామానికి సర్పంచ్‌గా ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్న ప్రభాకరరెడ్డి ప్రజాన్యాయవాదిగా పౌరహక్కుల న్యాయవాదిగా వేగంగా ఎదిగాడు. వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పోలీసులు 'టాడా' కేసులలో ఇరికించిన వందలాది గ్రామీణ పేదల తరపున న్యాయవాదిగా అహర్నిశలు కృషిచేసి రాష్ట్రంలో వేరే ఎక్కడా సాధ్యం కానంత వేగంగా వాళ్ళను బెయిలు పైన విడిపించాడు. పౌరహక్కుల ఉద్యమకారునిగా నిర్భయంగా జిల్లాలో పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొనడానికి అలసట లేకుండా కృషిచేసాడు. తమ నాలుగేళ్ళ స్తబ్దంగా ఉన్న జిల్లా శాఖకు వేగంగా జిల్లా ప్రజలలో తిరిగి గుర్తింపు లభించింది. 'విధి నిర్వహణ' గా పోలీసులు భావించే ఆక్రమాలకు ప్రభాకరరెడ్డి న్యాయవాదిగా పౌరహక్కుల ఉద్యమకారునిగా అడ్డు పడ్డాడు. దానికి కోపగించిన పోలీసులు ఒకసారి ప్రభాకర రెడ్డిని తప్పుడు కేసులో ఇరికించారు. తరువాత చంపుతామని బెదిరించారు. చివరికి 1991 డిసెంబరు 5వ తేదీన పీపుల్స్ వార్ గ్రూపు వరంగల్‌లో కాంగ్రెసు నాయకుడు హయగ్రీవాచారిని చంపగా దానిని ఆసరా చేసుకొని పోలీసులు 7వ తేదీన ప్రభాకర రెడ్డిని కాల్చి చంపారు.

ప్రభాకర రెడ్డి హత్యకు నిరసనగా రాష్ట్ర వ్యాపితంగా లాయర్లు కోర్టులను బహిష్కరించారు. వరంగల్‌లో వారం రోజులకుపైగా కోర్టు బహిష్కరణ జరిగింది. న్యాయవిచారణ జరిపించాలని, న్యాయవాదులు డిమాండ్ చేసారు.

మేము రాష్ట్ర వ్యాపితంగా నిరసన సభలు జరిపాము. ఇతర రాష్ట్రాలలోను విదేశాలలోను ఉన్న పౌరహక్కుల సంఘాలకు తమ నిరసన తెలియజేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ ఉత్తరాలు రాసాము. జాతీయ అంతర్జాతీయ స్థాయిలోని అనేక సంస్థలు, వ్యక్తులు రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రభాకర రెడ్డి హత్య పట్ల తమ నిరసన తెలియజేస్తూ, న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ఉత్తరాలు రాసారు.

మేము రాష్ట్ర వ్యాపితంగా పోస్టర్లు వేయడమేకాక 'పౌరహక్కుల ఉద్యమం పైన ఈ దాడులెందుకు ?' అనే శీర్షికతో ఒక పుస్తకం అచ్చువేసి (10 వేల కాపీలు) ప్రచారం చేసాము.

తన కర్తవ్య నిర్వహణలో ఎట్టి పరిస్థితిలోనూ వెనకాడని వ్యక్తి నర్రా ప్రభాకర రెడ్డి. తన స్వంత సమయాన్ని జంకులేకుండ పౌరహక్కుల ఉద్యమం కోసం వెచ్చించాడు. పేద ప్రజలకు న్యాయం చేకూర్చడానికి వెచ్చించాడు. పోలీసులు కక్షగట్టి అతని ప్రాణం తీయకపోతే పౌరహక్కుల ఉద్యమానికి అసామాన్యమయిన నాయకునిగా ఎదిగేవాడు. న్యాయవాద వృత్తికి ఉన్నత మయిన ఆదర్శంగా ఎదిగేవాడు. ప్రభాకరరెడ్డి కర్తవ్యదీక్ష, త్యాగశీలం పౌరహక్కుల ఉద్యమ కారులందరికీ ఆదర్శం కావాలి.

<u>**చుండూరు హత్యాకాండ**</u> :-

కారంచేడు కేసు విచారణ ఒంగోలునుండి గుంటూరు జిల్లా చుండూరులో 1991 ఆగస్టు 6న మ మరొక కారంచేడు జరిగింది.

ఆ సంవత్సరం జూలై 7వ తేదీనుండి చుండూరు గ్రామంలో దళితులకూ అగ్రకులాలకూ (ప్రధానంగా రెడ్లు) మధ్య ఘర్షణ వాతావరణం ఉండింది. కోస్తా ఆంధ్ర జిల్లాలలోని చాలా గ్రామాల లాగే చుండూరులో కూడా దళితులలో విద్య ప్రమాణాలు పెరిగాయి. కొందరు ఉద్యోగస్తులయ్యారు. సంప్రదాయక అణచివేతను వ్యతిరేకించి దళితులు సమాన ప్రతిపత్తినీ సమాన గౌరవాన్నీ కాంక్షించ సాగారు. ఈ ఆకాంక్షపట్ల అగ్ర కులాలలో ఉన్న అసహనం వల్ల చిన్న చిన్న సంఘటనలు కూడా తీవ్ర ఘర్షణకు దారితీసే వాతావరణం ఏర్పడింది. జూలై 7వ తేదీన రవి అనే దళిత యువకుడు సినిమా టాకీసులో శ్రీనివాసరెడ్డి అనే అగ్రకులస్తుడు కూర్చున్న సీటుమీద కాలుపెట్టాడని అతను ఘర్షణకు దిగడం అటువంటి ఒక ఘటన ఆ తరువాత రెడ్డి యువకులు రవిపైన దాడిచేసి తీవ్రంగా కొట్టారు. రెడ్లు కాపులు కలిసి దళితులపైన సాంఘిక బహిష్కరణ విధించారు. కుల పరమయిన ఈ సాంఘిక బహిష్కరణ చట్టం దృష్టిలో నేరం అయినప్పటికీ పోలీసులు అగ్రకులస్తులపైన చర్య తీసుకోలేదు. గ్రామంలో సెక్షన్ 144 పెట్టి బందోబస్తు పెంచారు.

ఆగస్టు నెలలో దళితులపైన రెడ్ల దాడులు కొనసాగాయి. 6వ తేదీ పొద్దున్న చుండూరు రెడ్లు పరిసర గ్రామాలయిన మోదుకూరు, వలివేరు, మున్నంగి నారిపాలెం తదితర గ్రామాల రెడ్లు కాపులతో కలిసి పెద్దఎత్తున గుమిగూడి దళితులపైన దాడిచేసారు. గుమిగూడిన అగ్ర కులస్తులను ఆపడానికి పోలీసులు ఎటువంటి ప్రయత్నం చేయలేదు. పైగా దళితుల ఇండ్లపైన అంతకు ముందే దాడిచేసి వాళ్లను చెల్లా చెదరు చేసారు. పట్టపగలు కొన్ని గంటలసేపు దళితుల ఊచకోత సాగుతుంటే ఆ రాత్రి దాకా పోలీసులు ఏమీ ఎరగనట్టే ఉండిపోయారు. గ్రామం ప్రశాంతంగా ఉందని రాత్రి పై అధికార్లకు మెసేజ్ కూడ ఇచ్చారు.

దాడిచేసిన అగ్ర కులస్తులు దళితులను అతికౄరంగా పట్టుకొని నరికి గోనెసంచులలో వేసి డ్రెయిన్‌లో పారేసారు. పోలీసులు గ్రామంలో ఉంటుండగానే సాయంత్రం దాకా యధేచ్ఛగా స్వైర విహారం చేసారు. ఎనిమిది మందిని చంపారు.

ఈ హత్యాకాండ గురించి మనం వెంటనే ఒపిడిఆర్ తో కలిసి నిజనిర్ధారణ కమిటీ వేయడమే కాక ఆ తరువాత చుండూరు బాధితులు దళిత మహాసభ నాయకత్వాన న్యాయం కోసం నిర్వహించిన పోరాటములో పాల్గొన్నాము. నిజనిర్ధారణ కమిటీ నివేదికను తెలుగులో అచ్చువేయడమే కాక ఇంగ్లీష్‌లో కూడా ఒక ప్రచురణ అచ్చువేసి బయటి రాష్ట్రాలకు పంపించాము. బహిరంగ సభలు నిర్వహించాము. దళిత సంస్థలు, ఇతర ప్రజాతంత్ర సంస్థలు నిర్వహించిన కార్యక్రమాలలో పాల్గొన్నాము.

హంతకులను అరెస్టు చేయాలనీ, వారి ఆస్తులు జప్తు చేయాలనీ, మారణకాండ జరుగు తుండగా గ్రామంలో ఉండి కూడ ఎటువంటి చర్య తీసుకోని సిఐ, ఎస్ఐ లను శిక్షించాలనీ, మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వడమే కాక మొత్తంగా చుండూరు దళితులకు పునరావాసం కల్పించాలనీ, కేసు విచారణ కోసం ప్రత్యేక కోర్టు నెలకొల్పాలనీ, తదితర డిమాండ్లతో చుండూరు దళితులు ఆందోళన చేసారు. ఆందోళన కారుల డిమాండ్లలో అధికభాగం ఎస్సి, ఎస్టి అత్యాచారాల నిరోధక చట్టం (1989) కింద ప్రభుత్వం బాధ్యతేనని వివరిస్తూ మనం ' చుండూరు మారణకాండ - ప్రభుత్వం వైఖరి ' అనే కరపత్రం అచ్చువేసి విస్తృతంగా పంచాము.

శాంతి భద్రతల పేరిట అప్పటి గుంటూరు జిల్లా ఎస్‌పి మీనా జిల్లాలో నిషేధాజ్ఞలు ప్రకటించి చుండూరు బాధితులకు మద్దతుగా ఎటువంటి బహిరంగ సభలూ కార్యక్రమాలూ జరగకుండా నిషేధించాడు. ఆందోళన చేసే హక్కు లేకపోతే దళితులపైన దాడులు ఆగవనీ దాడులను నిషేధాజ్ఞలు ఆపవనీ మనం నిరసన తెలియజేసాము.

ఆందోళన చేస్తున్న దళితుల శిబిరాన్ని తొలగించే నెపం మీద పోలీసులు సెప్టెంబర్ 10వ తేదీన పోలీసులు చుండూరు దళితులపైన దాడి చేసారు. వాళ్ళు సేకరించిన తిండి గింజలను చెల్లాచెదురు చేసారు. పరిస్థితిని శాంతింపజేయడానికి ప్రయత్నిస్తున్న అనిల్ కుమార్‌ను కాల్చి చంపారు. అనిల్ కుమార్ ఆగస్ట్ 6న జరిగిన హత్యాకాండకు సాక్షి. అతను చుండూరు దళితుల ఆందోళనలో చురుకైన పాత్ర నిర్వహించాడు. దళితుల తరఫున నాలుకగా వ్యవహరిస్తూ నాయకునిగా ఎదుగుతున్నాడు. అనిల్ కుమార్ హత్యపైన మనం ఒపిడిఆర్ తో కలిసి నిజనిర్ధారణ కమిటీ వేసి హైదరాబాద్‌లో ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టాము.

చుండూరు దళితుల ఆందోళనను విరమింప జేయడానికి ప్రభుత్వం కొన్ని హామీలు ఇచ్చింది. భూములు, ఉద్యోగాలు ఇచ్చి దళితులకు పునరావాసం కల్పిస్తామనీ, స్పెషల్ కోర్టు నెలకొల్పుతామనీ హామీ ఇచ్చింది. ఆ హామీలు నెరవేరక పోవడం వల్ల 1993లో చుండూరు దళితులు మళ్ళీ ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలో కూడా మనం దళిత సంస్థలతోను ఇతర ప్రజాతంత్ర ఉద్యమ సంస్థలతోను కలిసి పనిచేస్తున్నాం.

చుండూరు మారణకాండపైన, అనిల్ కుమార్ హత్యపైన న్యాయవిచారణ జరిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ గంగాధర రావు కమిషన్‌ను నియమించింది. కమిషన్‌ను బాధితులు బహిష్కరించినప్పటికీ గంగాధర రావు తన ' విచారణ ' పూర్తిచేసి అగ్రకుల శక్తుల వాదనను సమర్థించే పద్ధతిలో నివేదిక ప్రకటించాడు. దళితులు అగ్రకుల స్త్రీలను వేధించడం సమస్యకు మూలం అని ఏ ఆధారాలు లేకుండ నిర్ధారించాడు. పోలీసుల వైఫల్యాన్ని ఒప్పుకుంటూనే వాళ్ళపైన శాఖాపరమయిన చర్యతీసుకుంటే చాలు నన్నాడు. అనిల్ కుమార్ పైన కాల్పులు జరపడం సమర్థనీయం కాదంటూనే కాల్పులు జరిపిన సిబ్బంది పైన చర్యతీసుకు నవసరం లేదన్నాడు. ఈ నివేదికను మనం వివరంగా ఖండిస్తూ ' స్వేచ్ఛ ' లో వ్యాసం రాయడమే కాక సభలలో మాట్లాడాము.

<u>చేనేత కార్మికుల ఆకలిచావులు</u> :-

నూతన ఆర్థిక విధానాన్ని కేంద్రప్రభుత్వం ప్రకటించి అమలు చేయడం మొదలు పెట్టిన తొలి సంవత్సరమే మన రాష్ట్రంలో చాలా మంది చేనేత కార్మికులు ' ఆకలిచావుల ' పాలయ్యారు. 1991 సెప్టెంబర్ అక్టోబర్ నవంబర్ నెలలలో 110 మంది చేనేత కార్మికులు బ్రతుకు గడవక చనిపోయినట్లు వార్తలు వచ్చాయి.

ఈ మరణాలకు మూలమేమిటో తెలుసు కోవడం కోసం మన జిల్లా శాఖలు చేనేత పరిశ్రమ ఉన్న గ్రామాలలో పర్యటించి ఆ పరిశ్రమ స్థితిగతుల గురించి వివరాలు సేకరించారు. కృష్ణా, గుంటూరు, నల్గొండ, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు జిల్లాలలో సేకరించిన వివరాలను బట్టి నూతన ఆర్థిక విధానం ఫలితంగా ఒక్కసారిగా 30 శాతం మించి పెరిగిన నూలుధరలు, దానితో పాటు పెరిగిన రంగుల ధరలు, కొనుగోలు (మార్కెట్) తరుగుదల, జనతా వస్త్రాల పథకం సరిగ్గా పనిచేయక పోవడం, సొసైటీలకు ప్రభుత్వ బకాయిలు, కూలీరేట్లు తగ్గుదల మొదలయిన కారణాల ఫలితంగా నేత కార్మికుల జీవన ప్రమాణాలు గణనీయంగా పడి పోయాయి. దానివల్ల చాలా మంది చనిపోయారు.

ప్రభుత్వం ఆకలిచావులకు నిర్వచనమేమిటని తర్జన భర్జనలు పడింది తప్ప చేనేత రంగానికి ఆర్థిక సహాయం చేయడానికి కానీ దానిని బ్రతికించడానికి కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ పరిస్థితిని మనం వివరంగా విశ్లేషిస్తూ చేనేత సంక్షోభంపైన ఒక పరిశీలన (‘చిరుగుపాతలబరువు బతుకులు’) అనే ప్రచురణ తీసుకొచ్చాము. జిల్లా శాఖల నివేదికలు ఆధారంగా గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు అబ్దుల్ నూర్ బాషా ప్రచురణ తయారు చేసాడు.

<u>గులాం రసూల్ హత్య</u> :-

1991 నుండి మన రాష్ట్రంలో ఎన్‌కౌంటర్లు అంతకు ముందు ఎప్పుడూ లేనంతగా జరుగుతున్నాయి. కరీంనగర్ మహాసభల నుండి నేటికి 466 మంది ఎన్ కౌంటర్లలో చనిపోయారు.

ఈ హత్యలలో ఒక సంఘటన జాతీయ అంతర్జాతీయ స్థాయిలలో సంచలనం సృష్టించింది 1991 డిసెంబర్ 27వ తేదీన ఉదయం దినపత్రిక విలేకరి గులాం రసూల్‌ను, అతని స్నేహితుడు విజయ ప్రసాదరావును హైదరాబాద్‌లోని అంబర్‌పేట ప్రాంతంలో స్కూటర్ పైన పోతుండగా పోలీసులు పట్టుకొని 28 తెల్లవారు జామున రంగారెడ్డి జిల్లా మసీదు గూడా శివారులోని ఒక పాడుపడిన ఇంట్లో కాల్చి పడేసారు. వాళ్ళిద్దరూ ‘గుర్తు తెలియని తీవ్రవాదులు’ అని పోలీసులు అబద్ధపు ప్రకటన ఇచ్చి శవాలను తామే రహస్యంగా దహనం చేసారు. దీనివల్ల రెండు రోజులు దాకా చనిపోయినది ఎవరో తెలియలేదు. తెలిసిన తరువాత రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా సంచలనం చెలరేగింది. ఎడిటర్స్ గిల్డ్ ఒక నిజనిర్ధారణ కమిటీని పంపించి అది బూటకపు ఎన్‌కౌంటర్ అని ప్రకటించింది. విలేకర్ల సంఘాల ఒత్తిడి ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం న్యాయవిచారణ ప్రకటించింది. జస్టిస్ టిఎల్ఎన్ రెడ్డి గారిని కమీషన్‌గా నియమించింది.

మనం రసూల్ మృతికి నిరసనగా సభలు నిర్వహించడమే కాక, న్యాయవిచారణలో చురుగ్గా పాల్గొన్నాము. ఎనిమిది మంది సాక్షులను ప్రవేశపెట్టాము. వివిధ సందర్భాలలో రసూల్ న్యాయం కోసం రాజీపడకుండ పోరాడినందుకు పోలీసులకు అతనంటే ద్వేషం ఏర్పడిందనే అందువల్ల అతన్ని చంపారనే వాదించాము.

టిఎల్ఎన్ రెడ్డి కమీషన్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించి చాలా కాలం గడచినప్పటికీ ప్రభుత్వం నివేదికను ఇప్పటికీ అసెంబ్లీ ముందు ఉంచలేదు. ప్రధాన నిందితులయిన ఎస్‌పి భాస్కర రెడ్డినీ డిఎస్‌పి రాజయ్యనూ కనీసం సస్పెండ్ కూడ చేయలేదు.

విలేకరిగా ప్రజల సమస్యలకు తగు ప్రాధాన్యం ఇచ్చి రాయడమేకాక గులాం రసూల్ తన ఆచరణను ఆ వృత్తి పరిధికి పరిమితం చేయలేదు. అన్యాయం జరిగిన వాళ్ళకు న్యాయం కలిగించడానికి అవిశ్రాంతంగా కృషిచేసాడు. ఈ క్రమంలో పోలీసులతో శతృత్వం తెచ్చుకున్నాడు. అది అతనికి ప్రాణాంతకం అయింది. ఉన్నతమయిన అతని ప్రజాతంత్ర చైతన్యం పత్రికారంగానికి ఒక ఆదర్శంగా నిలిచిపోతుంది.

<u>పీపుల్స్‌వార్‌పైన నిషేధం</u> :-

సిపిఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్ (ను, ఆపార్టీ అనుబంధ సంస్థలయిన ప్రజా సంఘాలను రాష్ట్ర ప్రభుత్వం 1992 మే 21వ తేదీన నిషేధించింది. క్రిమినల్ లా సవరణ చట్టం (1908) కింద ఈ నిషేధాజ్ఞను జారీచేసింది. నక్సలైట్ ఉద్యమాన్ని ఒక రాజకీయ ఉద్యమంగా గుర్తించి దానిని రాజకీయంగా ఎదుర్కొనే బదులు కేవలం సామాజిక భద్రతకు సంబంధించిన విషయంగా గుర్తించి పోలీసు చర్యల

ద్వారా ఎదుర్కొనే పాలనా విధానంలో భాగంగా ఈ నిషేధ ప్రకటన జరిగింది. ప్రభుత్వం రెండు దశాబ్దాలుగా అనుసరిస్తున్న తప్పుడు వైఖరికి కొనసాగింపుగా జరిగిన ఈ నిషేధ ప్రకటనను మనం వెంటనే వ్యతిరేకిస్తూ పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించాము. చట్ట విరుద్ధంగా విపరీత మోతాదులో అమలవుతున్న నిర్బంధానికి చట్టబద్ధత అనే ముసుగు కల్పించడం కోసమే ఈ నిషేధం ఉద్దేశించబడిందని అన్నాము.

పీపుల్స్ వార్ గ్రూపయినా వేరే ఎవ్వరయినా చేపట్టే హింసను మనం సమర్థించడం లేదనీ అంతే ఆ హింసను నియంత్రించడానికీ ఎదుర్కొనడానికీ ఇప్పటికే చట్టాలు ఉన్నాయనీ అన్నాము. నిషేధం అనేది హింసను అరికట్టడానికి కాక రాజకీయ భావాలను అరికట్టడానికి ఉదేశించ బడిందని అన్నాము. ప్రజలకు తమకు నచ్చిన రాజకీయాలు ఎంచుకునే స్వేచ్ఛ ఉందనీ ఆ స్వేచ్ఛను నిషేదించడానికి వీలు లేద నీ అన్నాము.

నిషేధంపైన కోర్టులో కేసువేసే ఆలోచనతో మనం ఆ నిషేధ చట్టాన్ని పరిశీలించగా 1908 లో బ్రిటిష్ ప్రభుత్వం జారీచేసి 1950లో అప్పటి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం సవరించి ప్రయోగించిన క్రిమినల్ లా సవరణ చట్టాన్ని 1952లోనే మద్రాసు హైకోర్టు, సుప్రీంకోర్టు రాజ్యాంగ విరుద్ధమని కొట్టేసాయి. నలభై ఏళ్ళకింద న్యాయస్థానాలు రాజ్యాంగ విరుద్ధమని కొట్టేసిన చట్టాన్ని ఉపయోగించి రాష్ట్ర ప్రభుత్వం పీపుల్స్‌వార్ గ్రూపును నిషేధించిందంటే ప్రభుత్వానికి చట్టం అంటే ఎంతగౌరవం ఉందో అర్థం అవుతుందని చెప్తూ మనం ఈ విషయాన్ని పత్రికలకు తెలియజేసాము.

జూన్ 17వ తేదీన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజా భద్రతా ఆర్డినెన్స్ అనే కొత్త శాసనాన్ని జారీ చేసి దానికింద పీపుల్స్‌వార్ గ్రూప్‌ను ఆపార్టీ అనుబంధ సంస్థలనూ తిరిగి జూన్ 21వ తేదీన నిషే ధించింది. నిషేధం సక్రమమైనా కాదా తెలియ జేయడానికి ముగ్గురు రిటైర్డ్ హైకోర్టున్యాయ మూర్తులతో ఒక సలహా సంఘాన్ని నెలకొల్పి సలహాసంఘం ఆమోదం తీసుకొంది. సలహా సంఘానికి మన అభ్యంతరాన్ని సమర్పించే ఉద్దేశ్యంతో పీపుల్స్‌వార్ గ్రూపుపైన నిషేధాన్ని మనం ఎందుకు రాజ్యాంగ విరుద్ధమయినది చర్యగా భావిస్తున్నామో వివరిస్తూ వివరమయిన నోట్ తయారు చేసాము. అయితే బ్రిటిష్ వాళ్ళు 1908లో జారీచేసిన చట్టంలో 'అనిక్కికల వారెవ్వరయినా' సలహాసంఘం ముందు హాజరు కావచ్చుననిఉండగా జనార్దన రెడ్డి ప్రభుత్వం 1992లో జారీచేసిన ఆర్డినెన్స్‌లో ఆ అవకాశం నిషిద్ధ సంస్థకు, ప్రభుత్వానికి తప్పవేరే ఎవ్వరికీ ఇవ్వలేదు. ఈ సంగతి తెలిసి మన ప్రయత్నాన్ని విరమించుకున్నాము.

పత్రికా ప్రకటనలు ఇవ్వడమేకాక పీపుల్స్‌వార్ పైన నిషేధాన్ని వ్యతిరేకిస్తూ మనం ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాము. 1992 జూన్ 25వ తేదీన ఒపిడిఆర్ తో కలిసి హైదరాబాద్‌లో ఎమర్జెన్సీ వ్యతిరేక దినం' సందర్భంగా నిర్వహించిన ఊరేగింపు, బహిరంగ సభాకార్య క్రమంలో నిషేధాన్ని ప్రధాన విషయం చేసాము. రాష్ట్రంలో వివిధ సందర్భాలలో జరిపిన బహిరంగ సభలలో నిషేధాన్ని విమర్శిస్తూ మాట్లాడాము.

<u>నంద్యాల ఉపఎన్నిక</u> :-

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అనేది పరిపాలనలో ప్రజల అభీష్టాన్ని వ్యక్తంచేసే ఒక రాజకీయ వ్యవస్థగా పుట్టింది. ఆవ్యవస్థలో ఎన్ని లోపాలున్నా దానిని అధికారంలో ఉండేవాళ్ళు ధ్వంసం చేస్తుంటే వ్యతిరేకించడం పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యం అవుతుంది. ఆ విధ్వంసం మన దేశంలో చాలా దూరము పోయింది.

1991 నవంబర్ 16వ తేదీన జరిగిన నంద్యాల పార్లమెంటు ఉప ఎన్నికలో పి.వి.నరసింహారావు పార్లమెంటు సభ్యునిగా ఎన్నిక అయ్యాడు. దాదాపు 6 లక్షల మెజారిటీతో గెలిచాడు. అయితే ఆ ఎన్నికలో ఆద్యంతం ప్రజాస్వామ్య విలువల ఖూనీ జరిగింది. నామినేషన్లు వేయడానికి వచ్చిన స్వతంత్ర

అభ్యర్థులందరినీ కాంగ్రెస్ నాయకులు, ఎంఎల్ఏలు ఇతర సాయుధ ముఠా నాయకులు కలెక్టర్, ఆర్డివో, డిఆర్వోల ఆఫీసు గదుల నుండి, కలెక్టరేట్ ప్రాంగణం నుండి, ఆయుధాల సహాయంతో అపహరించి తీసుకుపోయి నామినేషన్లు గడువు అయిపోయేంత వరకు నిర్బంధించారు. వాళ్ళు మంది మార్బలంతో తుపాకులతో కలెక్టరేట్ ప్రాంగణంలోనే వారం రోజులు క్యాంప్ వేసారు. అధికార్ల సహాయ సహకారాలతో నామినేషన్లు వేయడానికి వచ్చిన వారిని కిడ్నాప్ చేసి తీసుకొని పోయారు.

ఇంక ఎన్నికల దినం వచ్చేటప్పటికి ప్రజల ఓటుహక్కు అనేదానికి ఏమాత్రం విలువ లేకుండ ఒక్కొక్క ప్రాంతంలో స్థానిక ఎంఎల్ఏలూ వాళ్ళ మనుషులు ఒకరితో ఒకరు పోటీపడి ఓట్లు గుద్దుకున్నారు. దేశప్రధాని ఈ విధంగా పార్లమెంటు సభ్యుడయ్యాడు.

మనం నామినేషన్ల ఘట్టం నుండి ఎన్నికల రోజుదాకా ఈ అక్రమాలను ఎండగడుతున్నాము. నామినేషన్లలో అపహరణ పర్వం గురించి ఓపిడిఆర్ తో కలిసి కరపత్రం వేసి రాష్ట్ర మంతటా పంచాము. నంద్యాలలో సభ నిర్వహించాము. పోలింగ్‌నాడు నియోజక వర్గంలో పర్యటించి దొంగవోటింగ్ సరళిని బహిర్గతం చేసాము. ఎన్నికల పరిశీలకుల దృష్టికి ప్రజల దృష్టికి తీసుకొని పోయాము.

<u>కల్తీ మద్యం చావులు</u> :-

1992-93 లో రాష్ట్ర వ్యాపితంగా నడిచిన సారా వ్యతిరేక మహిళా ఉద్యమం రాష్ట్రంలో ఈ రెండేళ్ళలో జరిగిన ఒక చెప్పుకోదగ్గ ఉదంతం. స్త్రీలు గ్రామాలలో పట్టణాలలో లక్షల సంఖ్యలో కదిలి పెట్టుబడలగా పోరాటం చేసారు. ఆ పోరాటంలో మన కార్యకర్తలు కూడా చాలా జిల్లాలలో చురుగ్గా భాగస్వాములయ్యారు.

ఈ ఉద్యమం పెట్టిన ఒత్తిడి ఫలితంగా సారాయి వ్యాపారాన్ని ప్రభుత్వం నిషేధించింది. అయితే ఆ తర్వాత దొంగ సారాయి ప్రవాహం అధికంగా ఉంటుందని అందరూ భయపడ్డారు. ఇది భయ పడిన దాని కంటే అధికంగానే జరుగుతోంది. సారాయి వ్యాపారం కోట్ల రూపాయల వ్యాపారం. రాజకీయ ప్రముఖులే దానిలో అగ్రభాగాన ఉన్నారు. ఈ ప్రముఖుల అధ్వర్యాన, లేక వాళ్ళ సంరక్షణలో దొంగ సారాయి రాష్ట్రంలో ప్రవహిస్తోంది. ప్రజా ఉద్యమాలు సాధించే విజయాలకు అధికారంలో ఉండేవాళ్ళు గండికొట్టే వైనానికి ఇదొక నికృష్టమైన ఉదాహరణ.

ఈ దొంగ సారాయి తయారీలో తగు జాగ్రత్తలు తీసుకొనే అవకాశం తక్కువ కాబట్టి అది కల్తీయై ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఈ సంవత్సరం నవంబర్ 25వ తేదీ రాత్రి కడప జిల్లా మైదుకూరులో ఒక బ్రాందీషాపులో నాటు సారాయి తాగిన వందలాది జనంలో 24 మంది చనిపోయారు. 131 అని అనధికార అంచనా. 110 మంది ఆస్పత్రి పాలయ్యారు. ఆ షాపు యజమాని చట్ట విరుద్ధంగా సబ్ లీజుకు తీసుకుని అమ్ముతున్నాడని అతని షాపులోనే కాక మైదుకూరు లోని అన్ని బ్రాందీ షాపులలోనూ నాటు సారాయి అమ్ముతున్నారని ఊరందరికీ తెలుసు. గతంలో ఆ షాపు యజమాని మీద ఎక్సైజ్ వాళ్ళు కేసు పెట్టగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రవీంద్ర రెడ్డి స్వయంగా విడిపించాడు. మొన్నటి మరణాల తర్వాత రవీంద్ర రెడ్డి సంరక్షకుడు వై.ఎస్.రాజశేఖర రెడ్డి అతని ప్రత్యర్థి దివాకర రెడ్డి పరస్పరం చాలా తిట్లు తిట్టుకున్నారు. మామూలుగానే దొంగ సారా వ్యాపారాన్ని చూసీ చూడనట్లు వూరుకుండి తమ జేబులు నింపుకునే పోలీసు, ఎక్సైజ్ శాఖలు ఘరానా హంతకులు సంఘర్షించుకుంటున్న ఈ వాతావరణంలో విధి నిర్వహణలో పూర్తిగా విఫలం కావడంలో ఆశ్చర్యంలేదు. మనం మైదుకూరు మరణాల పైన నిజనిర్ధారణ కమిటీ వేశాము. ప్రభుత్వం ప్రకటించిన న్యాయ విచారణలో పాల్గొంటాము.

మళ్ళీ నవంబర్ 28, 29, 30 తేదీలలో హైదరాబాద్ నగర శివారులోని అల్వాల్, వెంకటాపురం లలో కల్తీ సారాయి తాగి 17 మంది మరణించారు. చావు వార్త సైతం బయటకు రాకుండా నొక్కి పెట్టడానికి ఎక్సైజ్, పోలీసు అధికారులు, గుడుంబా వ్యాపారస్తులు శత విధాల ప్రయత్నం చేశారు. ఈ మరణాల విషయంలో కూడా మనం నిజ నిర్ధారణ కమిటీ వేశాము. ప్రభుత్వం ప్రకటించిన న్యాయ విచారణలో పాల్గొంటాము.

కల్తీ సారాయి మరణాలకు బాధ్యత వహించవలసిన ప్రభుత్వం అంగీకరించి మృతుల కుటుంబాలకు ఒక లక్ష రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలని పై సంఘటనలలో మనం డిమాండ్ చేశాము.

డి

వివిధ రంగాలలో మనం కరీంనగర్ మహాసభల తర్వాత చేపట్టిన కృషిని దిగువ వివరిస్తాము.

స్త్రీల బలవన్మరణాలు :-

మనం పితృస్వామ్యవ్యవస్థను ఒక ఆధిపత్య వ్యవస్థగా గుర్తించి దానివల్ల స్త్రీల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలపైన, జీవన ప్రమాణాల పైన, జీవితం పైన జరిగే దాడిని ఒక పౌర హక్కుల సమస్యగా గుర్తించి కృషి చేయాలని నిర్ణయించుకున్నాము. కరీంనగర్ మహాసభలలో ఈ విషయాన్ని స్పష్టంగానే నిర్ణయించుకున్నప్పటికీ మన ఆచరణలో రావలసినంత మార్పు రాలేదు.

మహిళా ఉద్యమాలు పెట్టిన ఒత్తిడి ఫలితంగా స్త్రీలపైన జరిగే భౌతిక హింసకు సంబంధించిన చట్టాన్ని ప్రభుత్వమే సవరించి బలోపేతం చేసింది. లైంగిక అత్యాచారాల విషయంలో కొన్ని సందర్భాలలో నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకునే బాధ్యత చట్టం ముద్దాయి పైననే పెట్టింది. కుటుంబంలో స్త్రీపైన ఆమె భర్త, అతని బంధువులు ప్రయోగించే వేధింపులు చట్టం ఒక నేరంగా గుర్తించి సెక్షన్ 498 ఎ ని, 304 బి ని భారత శిక్షా స్మృతిలో చేర్చింది. అయితే ఈ చట్టాలు అమలు కావడానికి న్యాయ వ్యవస్థలోనూ, బయటి సమాజంలోనూ అనేక ఆటంకాలున్నాయి.

కుటుంబం లోపల స్త్రీపైన ప్రయోగించే హింసను చట్టం ఒకనేరంగా గుర్తించినప్పటికీ దానిని నేరంగా చూసే దృష్టి పోలీసు వ్యవస్థకూ, న్యాయవ్యవస్థకూ ఇంకా అలవడ లేదు. ఇతర నేరాల విషయంలో ఉన్నటువంటి 'సీరియస్‌నెస్' ఈ విషయంలో లేదు. అయితే స్త్రీపైన జరిగే హింస ఆమె భర్త ఇంట్లో జరుగుతుంది. కాబట్టి సాక్ష్యాలు దొరకడం కష్టం కావడంవల్ల మరింత ఎక్కువ 'సీరియస్ నెస్' ఉంటే తప్ప ఈ కేసులు పరిష్కారంకావు.

బయటి సమాజంలో కూడా ఈ హింసను కుటుంబానికి అంతర్గతమైన సంస్కృతి పోలేదు. అందువల్ల దొంగతనాల విషయంలో సాక్ష్యానికి వచ్చే ఇరుగుపొరుగు ఈ విషయంలో రారు. మృతురాలి తోబుట్టువులు, తల్లిదండ్రులు సైతం ఆమె మరణాన్ని ఆమె పిల్లల భవిష్యత్తో, ఆమె చెల్లెళ్ళ పెళ్ళిలో ముడిపెట్టి ఫిర్యాదు చేయడానికి, సాక్ష్యం ఇవ్వడానికి తరచుగా ముందుకురారు. ఒక వేళ వాళ్ళు వచ్చినా కులపెద్దలు, ఊరిపెద్దలు హితోపదేశం చేసి వెనక్కి లాగుతారు.

పౌరహక్కులను అమలు చేయని అధికార యంత్రాంగాన్నేకాక ఆ హక్కులకు ఆటంకమయ్యే సామాజిక వ్యవస్థనూ సంస్కృతినీ కూడా వ్యతిరేకించే కర్తవ్యం పౌరహక్కుల ఉద్యమం మీద వుంది. అందువల్ల పైన పేర్కొన్న అన్ని అంశాలలోనూ మార్పుకోసం కృషి చేయవలసివుంది. మనం పట్టుదలగా కృషి చేసింది కొన్ని సంఘటనలలోనే. వాటి విషయంలో పోలీసులమీద ఒత్తిడి పెట్టడం,

అవసరమైనప్పుడు 'స్పెషల్ పిపి' ని పెట్టించడమే కాక మృతురాలి బంధువులలో గట్టిగా నిలబడడానికి సిద్ధంగా ఉన్నవాళ్ళకు మనం అండగా వుండి సామాజిక వ్యవస్థనుండి వచ్చే ఒత్తిడిని ఎదుర్కొనడానికి సహాయం చేయగలిగాము. ఈకృషి ఇంకా చాలా జరగవలసి ఉంది.

కుటుంబంలో స్త్రీల బలవన్మరణాలు రాష్ట్రంలో పెద్ద యెత్తున జరుగుతున్నాయి. 1993 మొదటి 6 నెలలలో రాష్ట్రం మొత్తం మీద 1340 మంది వివాహిత స్త్రీలు బలవన్మరణం పాలయ్యారు. ఈ లెక్కన సంవత్సరం మొత్తం మీద జిల్లాకు 115 మంది చనిపోతున్నట్టు లెక్క. వీటిలో మనం కృషి చేస్తే ఫలితం దక్కే కేసులను ఎంచుకొని మహిళా ఉద్యమాలు సాధించుకున్న హక్కులు స్త్రీలకు అందేటట్లు చూడాలి.

ఈ విషయంలో కార్యకర్తల అవగాహన పెంచడం కోసం డా|| రామనాథం 8వ వర్ధంతి సందర్భంగా 1993 సెప్టెంబర్ 5న 'విజయవాడ' లో 'సెమినార్' నిర్వహించాము. 'స్త్రీల బలవన్మరణాలు, చట్టం - న్యాయవ్యవస్థ, సామాజిక నేపథ్యం' - అనే అంశం మీద నిర్వహించిన ఈ సెమినార్‌కు రాష్ట్ర వ్యాపితంగా కార్యకర్తలు బాగానే హాజరయ్యారు. ఒక్కొక్క జిల్లాలో ఈ సంవత్సరం మొదటి 6 నెలలలో బలవన్మరణం పాలైన వివాహిత స్త్రీల జాబితా ఆయా జిల్లా శాఖలు సేకరించి ఇచ్చాయి. ఈ విషయంలో మన ఆచరణ దాదాపు శూన్యం కావడం వల్ల జాబితా సేకరణ కోసం మనం దిన పత్రికల మీద ఆధారపడవలసి వచ్చింది. 'సెమినార్' బాగానే జరిగినట్లు అందరూ భావించారు గానీ దాని ఫలితంగా స్త్రీల బలవన్మరణాల విషయంలో మన ఆచరణ మట్టుకు మెరుగైనట్టు కనిపించదు. ఈ మహాసభల తర్వాత ఒక కార్యక్రమంగా తీసుకొని మెరుగు పర్చుకోవాలి.

బలవన్మరణాల విషయంలో చేసిన ఈపాటి కృషి కూడా మనం లైంగిక అత్యాచారాల విషయంలో కానీ, స్త్రీలకు సంబంధించిన ఇతర హక్కుల విషయంలో గానీ చేయలేదు.

## దళితులపైన హింసాకాండ :-

గత రాష్ట్ర మహాసభల తర్వాత చుండూరు మారణకాండ కాక మరొక 31 సంఘటనలలో అగ్రకులాల దాడులలో దళితులు చనిపోయారు. మృతుల సంఖ్య 33. అయితే ఇవి పత్రికల దృష్టికే, ఉద్యమాల దృష్టికి వచ్చిన సంఘటనలు. రాకుండా వుండిపోయినవి ఎన్నో అంచనా వేసే మార్గం ఏదీలేదు. ఉదాహరణకు గుంటూరు, ప్రకాశం జిల్లాలలో ఉన్నంతగా ఈ హంతక దాడులు తెలంగాణా, రాయలసీమలలో వార్తలలో కనిపించేవి కావు. కానీ ఈ రెండేళ్ళలో అనంతపురంలో 5 గురు, కర్నూలులో 7 గురు, కరీంనగర్‌లో 4 గురు దళితులు గ్రామ అగ్ర కులస్తుల చేతిలో హతమైనట్టు వార్తలొచ్చాయి. ఈ హత్యల విషయంలో ఆందోళన కూడా జరిగింది. దళిత ఉద్యమం వ్యాప్తి ఫలితంగా ఒకప్పుడు మామూలు హత్యగా కనిపించిన వాటిని ఇప్పుడు కులపరమైన దాడులుగా అర్థం చేసుకోవడం జరుగుతూవుంది. ఉద్యమాలు మరింత వ్యాపిస్తే ఇంకెన్ని సంఘటనలు బయటికొస్తాయో.

మనం ఒక్కొక్క సంఘటన పైనా నిజనిర్ధారణ కమిటీ వేసి వాస్తవాలు తెలుసుకుంటున్నాం. పోలీసులపైన ఒత్తిడి పెట్టి కేసులు సక్రమంగా నమోదయ్యేటట్టు చూస్తున్నాం. అధికారులపైన ఒత్తిడి పెట్టి బాధితులకు పునరావాసం లేదా నష్ట పరిహారం ఇప్పించడానికి కృషిచేస్తున్నాం.

ఈ పనులన్నీ మనం స్వతంత్రంగా చేయడమే కాక దళిత సంఘాలతోను, ఇతర ప్రజాతంత్ర ఉద్యమ సంస్థలతోనూ కలిసి పనిచేస్తున్నాం. అధికారులపైనా, పోలీసులపైనా ఒత్తిడి పెట్టేక్రమంలో ధర్నాలు, ఊరేగింపులు, సభలు తదితర ఆందోళనా కార్యక్రమాలు ఉమ్మడిగా చేపడుతున్నాం. దళితుల సమస్యల విషయంలో ఉమ్మడి కార్యక్రమాలు చేపట్టే సత్సంప్రదాయం రాష్ట్రంలో చాలా చోట్ల నెలకొంది. గుంటూరు జిల్లాను ఈ విషయంలో ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఈ సత్సంప్రదాయాన్ని నెలకొల్పడంలోనూ నిలబెట్టడంలోనూ అందరితోపాటు మనకృషి కూడా వుంది.

గతంలో దళితులపైన జరిగిన హత్యాకాండకు సంబంధించిన క్రిమినల్ కేసులు ప్రస్తుతం వివిధ జిల్లా కోర్టుల్లో నడుస్తున్నాయి. కొన్ని కేసులలో ప్రాసిక్యూషన్‌కు సహాయంగా మన జిల్లా శాఖలు కృషి చేస్తున్నాయి. గుంటూరులో జరుగుతున్న 'కారంచేడు కేసు'లోనూ, విజయనగరంలో జరుగుతున్న 'కస్పాగదిబవలస కేసు'లోనూ ఈ కృషి బాగా జరుగుతున్నది.

దాడులు జరిగినప్పుడు స్పందించడమే కాక రిజర్వేషన్లు, సాంఘిక సంక్షేమ చర్యల సక్రమ అమలు కోసం కూడా మనం సందర్భం వచ్చినప్పుడు కృషిచేస్తూ ఉన్నాం. శ్రీకాకుళంకు చెందిన 'బెంతొరియా గిరిజనుల'ను షెడ్యూల్డు తెగల జాబితా నుంచి ప్రభుత్వ అధికారులు అక్రమంగా తొలగించగా దాని పునరుద్ధరణకోసం జరుగుతున్న ఆందోళనకు మద్దతుగా మనం పాల్గొంటున్నాం.

'కులం' సమస్యను మరింత విస్తృతంగా అర్థం చేసుకొని కుల వివక్షకు, బ్రాహ్మణీయ సంస్కృతికి వ్యతిరేకంగా మనం కృషి చేయాలి. ఈ కృషి మన నిత్య ప్రచారంలో ఒక అంశమయ్యింది. అది చెప్పుకోదగ్గ విషయం. భవిష్యత్తులో నిర్దిష్టమైన కార్య క్రమాలు చేపట్టి పని చేయాలి.

<u>మతోన్మాదం</u> :-

'లౌకికత' ఒక ప్రజాస్వామిక విలువ అని మనం గుర్తిస్తున్నాం. భారత దేశ నిర్దిష్ట పరిస్థితిలో అది కుల వ్యవస్థను, బ్రాహ్మణీయ సంస్కృతిని వ్యతిరేకించే భావన. భారత రాజ్యాంగంలో 'సెక్యులర్' అన్నమాట 1975 దాకా లేకున్నప్పటికీ 'సెక్యులరిజం' ఆర్టికల్స్ 14, 15, 16, 17 లలో ఉంది.

కొన్ని సంవత్సరాలుగా సమాజంలో బలపడుతున్న హిందూ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా మనం ప్రచారం చేస్తున్నాం. రథయాత్రలను, కరసేవలను హిందూమత రాజ్యానికి దారితీస్తున్న చర్యలుగా, మైనారిటీల పైన దాడులకు పురిగొల్పుతున్న చర్యలుగా మనం వ్యతిరేకించాం. ఏ మతోన్మాదమైనా ప్రజాతంత్ర విలువలకు శత్రువే. అయితే మన దేశంలో హిందూ మతోన్మాదమే సమాజం పైన ఆధిపత్యాన్ని, రాజ్యాధికారాన్ని, చేజిక్కించుకోగలదు కాబట్టి దానిని ప్రధానంగా ఎదుర్కోవలసి ఉంది.

1992 డిసెంబర్ 6వ తేదీన హిందూ మతోన్మాదులు అయోధ్యలో బాబ్రీమసీదును కూల్చివేసిన తర్వాత మన ప్రచారాన్ని ఇతోధికం చేశాం. రాష్ట్రంలో చాలా చోట్ల బహిరంగ సభలు నిర్వహించాం. ఓపిడిఆర్ తో కలిసి 1993 ఏప్రిల్ 10వ తేదీన హైదరాబాద్, గుంటూరు , అనంతపురంలలో మతోన్మాదం పైన సదస్సులు నిర్వహించాం. ఢిల్లీ, మద్రాస్, హైదరాబాద్‌లకు చెందిన సామాజిక శాస్త్రవేత్తలు ఈ సదస్సుల్లో పాల్గొన్నారు. ఓపిడిఆర్ తో కలిసి రెండు సార్లు వివరంగా 10 వేల కరపత్రాలు అచ్చువేసి విస్తృతంగా పంచాము. బాబ్రీమసీదు కూల్చివేత తరువాత హైదరాబాద్‌లో జరిగిన హత్యల గురించి నిజనిర్ధారణ కమిటీ వేసి పర్యటించాము. ఈ హత్యలలో పోలీసు కాల్పులలో జరిగినవే ఎక్కువ.

హిందూ మతోన్మాదులను కేవలం మైనారిటీల హక్కులకు, మసుగడకు మాత్రమే శత్రువుకాదని, అన్నిరకాల ప్రజాతంత్ర విలువలకు అది శత్రువని మన ప్రచారంలో వివరంగా చెప్పాము. కార్మికులు, దళితులు, ఆదివాసీలు, స్త్రీలు, అల్పసంఖ్యాక జాతుల హక్కులకూ, అభ్యుదయానికీ అది శత్రువని వివరంగా ప్రచారం చేశాము.

అయితే మతోన్మాదాన్ని ఎదుర్కోవడానికి అధికారయంత్రాంగం తన చేతుల్లోకి అపరిమితమైన అధికారాలు తీసుకోవడాన్ని మనం నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తున్నాం. మత సంస్థల నిషేధాన్ని. బి.జె.పి. సభలు సమావేశాలపైన నిషేధాన్ని వ్యతిరేకించాం. హిందూ మతోన్మాదం అధికార యంత్రాంగం అండదండలతనే ఎదిగింది. కేంద్ర ప్రభుత్వం లాలూచీ తోనే బాబ్రీమసీదు విధ్వంసం జరిగింది! ఇప్పుడు హిందుత్వ శక్తుల నెదుర్కోవడానికి ఆ ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తానంటే దాని నిజాయితీని శంకించవలసి ఉంది. దానిని ఆమోదించడం నిర్బంధ అధికారానికి మరింత సాధికారిత కల్పించి చివరకు ప్రజాస్వామ్యానికే నష్టం చేయడం తప్ప మరేమీకాదు. సామాజికంగా ఫాసిస్టు శక్తి అయిన హిందూ మతోన్మాదాన్ని ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం చేతిలో అపరిమిత అధికారం పెడితే అది ఇంకొక రకం ఫాసిజాన్ని పోషించడం అవుతుంది.

బాబ్రీమసీదు కూల్చివేత తర్వాత బొంబాయిలో పోలీసుల అండతో శివసేన మూకలు జరిపిన హత్యాకాండపైన 'భారత ప్రజల మానవ హక్కుల ట్రిబ్యునల్' విచారణ జరిపి ప్రకటించిన నివేదిక సారాంశాన్ని 'స్వేచ్ఛ' లో ప్రచురించాం. ఆ విచారణ జరిపిన ఇద్దరు న్యాయమూర్తులలో ఒకరైన జస్టిస్ సురేష్ గారిని ఈ మహాసభల ముఖ్య అతిథిగా ఆహ్వానించాము.

భవిష్యత్తులో హిందుత్వ శక్తులను భావజాల రంగంలో ఎదుర్కోవడం , మైనారిటీల హక్కులకు అండగా నిలబడడం మన ముందున్న ఒక ముఖ్య కర్తవ్యంగా కొనసాగుతుంది.

<u>నక్సలైట్ ఉద్యమం పైన నిర్బంధం</u> :-

నక్సలైట్ ఉద్యమాన్ని పీడిత ప్రజల సమస్యల నుండి పుట్టిన రాజకీయ ఉద్యమంగా చూడకుండా కేవలం శాంతి భద్రతల సమస్యగా చూడడం, ఆ సమస్య ఎదుర్కొనడానికి పోలీసులకు చట్ట విరుద్ధమైన ఆదేశాలు అధికారాలు ఇవ్వడం 25 సంవత్సరాలుగా సాగుతున్న ప్రభుత్వ విధానమే. అయితే ఈ

రెండున్నర సంవత్సరములలో ఈ అణచివేత రాశిలో చాలా పెరిగడమే కాక రాష్ట్ర పోలీసులకు తోడుగా సరిహద్దు భద్రతా దళాల, ఇండో టిబెట్ సరిహద్దు పోలీసులు, అదనపు కేంద్ర రిజర్వ్ పోలీసు బలగాలు రంగంలోనికి దిగాయి. ఈ బలగాల అణచివేత అనేక రూపాలలో అమలవుతున్నప్పటికీ ఎన్‌కౌంటర్ హత్యలు దానికి సంకేతంగా నిలిచాయి. కరీంనగర్ మహాసభలకు కర్నూలు మహాసభలకు మధ్య 466 మంది ఎన్ కౌంటర్‌లలో చనిపోయారు. రాష్ట్రంలో ఎన్ కౌంటర్‌లు మొదలయి 25 సంవత్సరాలు గడిచాయి. ఈ 25 సంవత్సరములలో ఎన్‌కౌంటర్‌లలో హతులైన వారి సంఖ్య దాదాపు 1070 అని అంచనా. అటువంటిది గడచిన 2 1/2 సంవత్సరములలోనే 466 మంది చనిపోయారంటే ఈ హత్యాకాండ ప్రస్తుతము ఎంత తీవ్రంగా అమలవుచున్నదో అర్థం అవుతుంది. ఈ 466 లో 256 మంది ఒక్క 1992 సంవత్సరములోనే చనిపోయారు.

మనం 1991 లోను 1993 లోను జరిగిన అన్ని ఎన్‌కౌంటర్‌ల మీద నిజనిర్ధారణ కమిటీలు వేసి వాస్తవాలు సేకరించాము. 1992లో దాదాపు సగం సంఘటనల గురించి వెనువెంటనే నిజనిర్ధారణ కమిటీలు వేయలేక పోయాము. సంఘటనల వివరాలు ఆలస్యంగా సేకరించాము. ఆ సంవత్సరము ఎన్‌కౌంటర్స్ విపరీత సంఖ్యలో జరగడం దీనికొక కారణం. నర్రా ప్రభాకర రెడ్డి హత్య, 1992 ఫిబ్రవరి 4వ తేదీన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీద పోలీసుల కొత్తగూడెంలో గూండాలచేత చేయించిన దాడి, తదితర నిర్బంధకాండ ఇంకొక కారణం.

నిర్బంధం మీద మనం ఎప్పటిలాగా సభలు, సమావేశాలు, నిర్వహిస్తున్నాము. నిజ నిర్ధారణ కమిటీలు వెలికితీసిన విషయాలను ''స్వేచ్ఛ'' పత్రికలో ప్రచురిస్తున్నాము. వివిధ సందర్భాలలో ప్రచారం చేస్తున్నాము. 1991 ఆగస్ట 31, సెప్టెంబర్ 1 తేదీలలో ఒపిడిఆర్‌తో కలసి హైదరాబాదులో 'రాజ్యహింస' అనే అంశం మీద ''అఖిల భారత సదస్సు'' జరిపాము. బొంబాయి, కలకత్తా, అస్సాం, తమిళనాడు, ఢిల్లీ, తదితర ప్రాంతాల నుండి పౌరహక్కుల సంస్థల బాధ్యులు పాల్గొని తమ తమ అనుభవాలు వివరించారు. ఆ సందర్భంగా నగరంలో ఊరేగింపు తీసాము. ఆ సదస్సులో పాల్గొన్న సంస్థలు తీసుకున్న నిర్ణయాన్ని అనుసరించి రాష్ట్రంలో ఎన్‌కౌంటర్‌ల గురించి వివరాలు సేకరించడానికి ఒక ''అఖిల భారత నిజనిర్ధారణ కమిటీ'' 1991 అక్టోబర్ 14 నుండి 18 దాక ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలలో పర్యటించింది. కమిటీలో ఏపిసిఎల్‌సి, ఒపిడిఆర్ లతో పాటు సిపిడిఆర్ (బొంబాయి) పియుడిఆర్ (ఢిల్లీ), ఒసిడిఆర్ (మద్రాస్) ప్రతినిధులు పాల్గొన్నారు. 20 మంది ప్రాణాలు తీసిన పది ఎన్‌కౌంటర్ ఘటనలు గురించి ఈ నిజనిర్ధారణ కమిటీ విషయసేకరణ చేసి అక్టోబర్ 20వ తేదీన హైదరాబాద్‌లో విలేఖరుల సమావేశంలో తన నివేదికను విడుదల చేసింది.

ఆంధ్రప్రదేశ్‌లో నిర్బంధ పరిస్థితులు వివరిస్తూ 1992 ఫిబ్రవరి నెలలో బొంబాయి, అహమ్మదాబాద్, ఢిల్లీ, కలకత్తా, మద్రాసు, బెంగుళూరులలో స్థానిక పౌరహక్కుల సంఘాల సహాయంతో ప్రెస్ కాన్ఫరెన్సులు బహిరంగ సభలు నిర్వహించాము. మనతోపాటు ఒపిడిఆర్ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అణచివేత గురించి ఇంగ్లీష్‌లో ఒక సంయుక్త నివేదిక ప్రచురించాము. అంతకుముందు సంవత్సరము అక్టోబర్‌లో అఖిలభారత నిజనిర్ధారణ కమిటీ ప్రకటించిన నివేదికను ఈ ప్రచురణలో అచ్చువేశాము.

1992 మార్చి, 14, 15 తేదీలలో ఒపిడిఆర్ తో కలిసి ప్రజాఉద్యమాలు ప్రభుత్వ వైఖరి అనే అంశంమీద హైదరాబాద్‌లో సదస్సు ఊరేగింపు నిర్వహించాము. విభిన్న ప్రాంతాలకు చెందినటు వంటి మేధావులు సదస్సులో ప్రసంగించారు.

1992 జూన్ 25 తేదీని ఎమర్జెన్సీ వ్యతిరేక దినంగా ఒపిడిఆర్ తో కలసి పాటించాము. హైదరాబాద్‌లో ఊరేగింపు బహిరంగ సభ నిర్వహించాము. పారా మిలటరీ దళాలు ఉపసంహరించాలనీ ఎన్‌కౌంటర్లు ఆపాలని, పీపుల్స్‌వార్ గ్రూప్‌పైన నిషేధాన్ని ఎత్తివేయాలని ఊరేగింపులో ప్రధానంగా డిమాండ్ చేశాము.

నర్రా ప్రభాకరరెడ్డి మొదటి వర్ధంతి సందర్భంగా 1992 డిసెంబరు 3నుండి 7 వరకు సూర్యాపేట నుండి హైదరాబాద్ దాక ఒపిడిఆర్ తో కలసి పౌరహక్కుల పాదయాత్ర నిర్వహించాము. ఇతర పౌరహక్కుల డిమాండ్లతో పాటు నిర్బంధ వ్యతిరేక నినాదాలు ఇచ్చాము. దారిపొడవునా పదివేల కరపత్రాలు పంచాము. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న నిర్బంధాన్ని గురించి స్వయంగా చూసి నిజ నిర్ధారణ జరపమని మనం చాలా కాలంగా అంతర్జాతీయ పౌరహక్కుల సంస్థలను ఆహ్వానిస్తున్నాము. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆంధ్ర ప్రదేశ్‌ను సందర్శించడానికి అనుమతి కావాలని భారత ప్రభుత్వాన్ని కోరింది కాని భారత ప్రభుత్వం అనుమతించలేదు. అయితే ''హ్యూమన్ రైట్స వాచ్'' శాఖ అయిన ఆసియా వాచ్ ప్రతినిధి ఒకరు 1992 జనవరిలో ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారు. తెలంగాణా జిల్లాలలో విషయ సేకరణ చేయడానికి ఆమెకు మనం సహాయం చేశాం. ఆమె పర్యటన ఫలితంగా 1992 సెప్టెంబర్ నెలలో ''ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు హత్యాకాండ - గ్రామీణ కల్లోలం'' అనే నివేదికను వాషింగ్టన్‌లో ఆసియా వాచ్ విడుదల చేసింది. దానిని మనం తెలుగులోనికి అనువదించి 1990 నుండి 1993 ఫిబ్రవరి వరకు జరిగిన ఎన్‌కౌంటర్ల జాబితాను జతచేసి 1993 మార్చిలో ప్రచురించాము.

జస్టిస్ వి.ఆర్.కృష్ణయ్యర్ అధ్యక్షులుగా ఉన్న భారత ప్రజల మానవ హక్కుల ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌కౌంటర్ల గురించి అనధికార న్యాయ విచారణ జరపడానికి ఒప్పుకుంది. మహా సభల అనంతరం విచారణలు జరిపించాలి.

ఎన్‌కౌంటర్ హత్యలు తప్ప నిర్బంధానికి సంబంధించిన ఇతర ఘటనల గురించి మనం ఎక్కువ కృషి చేయలేకపోయాం. మన కరీంనగర్ మహాసభల నాటికే పార్లమెంట్ ఎన్నికల ప్రచార ఘట్టం ప్రారంభం అయింది. కరీంనగర్‌లో పోటీచేసిన సిపిఐ (యంయల్) అభ్యర్థి ఎన్.వి.కృష్ణయ్య ప్రచారం మీద పోలీసులు చేసిన దాడిని వ్యతిరేకించడానికి మనం చేయగల కృషిచేశాం. పోలీసులే ఆయనకు ప్రత్యర్థి అయినట్లు ఆయన ప్రచార కార్యకర్తలను, మద్దతు దారులను అరెస్ట్‌చేయడం బెదిరించడం మొదలయిన చర్యలను మనం వ్యతిరేకించాం. ఈ ఘర్షణలో భాగంగా సిరిసిల్ల ప్రాంతంలో ఎన్నికల ప్రచార సమయంలో వరుసగా ఎన్‌కౌంటర్‌లు జరిగాయి. ఎన్నికల అధికారి అయిన జిల్లా కలెక్టర్‌ను, కేంద్ర ఎన్నికల అధికారులను కలసి మన నిరశనను వారికి తెలియజేశాము. ఖమ్మంలో కూడ సిపిఐ (ఎంఎల్) అభ్యర్థి గద్దం వెంకట్రామయ్య ప్రచారంపైన పోలీసులు ఇదే విధంగా దాడిచేసారు. కాచనపల్లిలో ఆయిదుగురిని చంపిన బూటకపు ఎన్‌కౌంటర్ ఈ సందర్భంలో జరిగింది. మనం ఖమ్మంలో కూడ పర్యటించి ఎన్నికల ప్రక్రియలో పోలీసుల జోక్యంపట్ల మన నిరసనను తెలియజేసాము.

సరిహద్దు భద్రతా దళం రాష్ట్రంలోకి దిగిన తర్వాత జవానులు స్త్రీలపైన అత్యాచారాలు చేసిన సంఘటనలు ఖమ్మంలో, వరంగల్‌లో జరిగాయి. వరంగల్ జిల్లా ఏటూరునాగారం మండలం కంతాత్మకూర్ గ్రామంలో 1992 డిసెంబర్ 24న బియస్ఎఫ్ జవానులు ముగ్గురుస్త్రీలపైన అత్యాచారం చేసిన విషయం మటుకు నిజనిర్ధారణ కమిటీవేశాం.

ఎన్‌కౌంటర్‌లలో చనిపోతున్నది మొసహాయంపు లేకుండా అంతాపేదవాళ్లే. అత్యధిక భాగం దళిత వెనుకబడిన కులాలకు చెందిన వారే. పైగా ఎక్కువ మంది అండర్‌గ్రౌండ్ కార్యకర్తలు కాక గ్రామంలో ఉంటూ పనిచేసుకొని బ్రతికేవాళ్లు కాబట్టి వారి మరణంతో కుటుంబానికి జీవనాధారం పోతున్నది. వాళ్లకు పునరావాసం కల్పించే ప్రయత్నం కొంతమేరకు చేస్తున్నాం. జిల్లా అధికారుల ద్వారా వాళ్లకు కొంత భూమికాని ఇతర జీవనాధారం గాని ఇప్పించే ప్రయత్నం చేస్తున్నాము. ఈ ప్రయత్నాన్ని మరింత మెరుగుపరచుకోవాలి.

ఇంటినుండి తీసుకుని పోయి చంపిన ఎన్‌కౌంటర్ ఘటనల విషయంలో మృతుని బంధువులు మెజిస్ట్రీరియల్ విచారణలో సాక్ష్యం చెపుతున్నారు. కొన్ని ఘటనలలో ఎన్‌కౌంటర్ పట్ల నిరసన తెలుపుతూ ప్రజలే ఆందోళన కూడ చేసారు. కాచినపల్లి (ఖమ్మంజిల్లా), మహబూబాబాద్ (వరంగల్ జిల్లా), మర్కల్ (నిజామాబాద్ జిల్లా) సంఘటనలు దీనికి ఉదాహరణలు. శ్రీకాకుళం, మహబూబ్ నగర్, అనంతపురం జిల్లాలలో మనం కూడ మెజిస్ట్రీరియల్ విచారణలకు హాజరయ్యాం. ఉత్తర తెలంగాణా జిల్లాలలో మనం స్వయంగా హాజరు కాకపోయినా మన నిజనిర్ధారణ కమిటీల నివేదికలను సంబంధిత అధికారులకు పంపించి నమోదు చేయిస్తున్నాము. సాక్ష్యాలున్న కేసులలో హైకోర్టులలో రిట్ పిటిషన్‌లు వేసే ప్రయత్నం కూడ ప్రారంభించాం. అనంతపురం, మహబూబ్‌నగర్, కరీంనగర్, వరంగల్ జిల్లాలలో జరిగిన కొన్ని కేసులను ఎంపికచేసుకున్నాం.

రాష్ట్రంలో **'టాడా'** చట్టం ప్రయోగం గురించి మనం ప్రచారం చేస్తున్నాం. అందుకోసమే తెలియజేస్తున్నాం. టాడా ముద్దాయిలకు జిల్లా కోర్టులు ఎంతకాలమైనా బెయిలు ఇవ్వక పోవడాన్ని గురించి గుంటూరు, ప్రకాశం, జిల్లాలలో కొన్ని కేసుల్లో ఆందోళన చేయగలిగాము. గుంటూరులో రామాపురం గ్రామానికి చెందిన నలుగురు టాడా ముద్దాయిల బెయిలు విషయం మనం పత్రికలతో ఒక సమిష్టి ఆందోళన రూపం తీసుకుంది. అయితే టాడా చట్టం దుర్వినియోగం గురించి ఒక సమగ్రమైన **నివేదిక** తయారు చేసి అంది రెండు సంవత్సరాలకు పూర్తికావస్తున్నా నిర్ణయం తీసుకోలేదు. ఢిల్లీకి చెందిన పియుడి ఆర్ సంస్థ టాడా చట్టాన్ని గురించి ఆ సంస్థ ప్రచురించిన నివేదికకు మనం సమగ్రమైన ప్రచారాన్ని అందించ లేకపోయాం.

<u>ఖైదీల హక్కులు</u> :- రాష్ట్రంలోని జైళ్లలో ఖైదీల మీద వారి హక్కుల మీద రకరకాల రూపాలలో దాడులు జరుగుతున్నాయి. జైళ్లలో రాజకీయ ఖైదీలు ఉండడం వలన ఈ దాడుల వార్తలు బయటికి వస్తున్నాయి, హైదరాబాద్, వరంగల్, రాజమండ్రి విశాఖపట్నం జైళ్లలోని నక్సలైట్ ఖైదీలు అనేక ఆందోళనలు చేశారు, ఖైదీల హక్కుల సమస్య ఈ ఆందోళనల ఫలితంగా పత్రికలకు ఎక్కువ ప్రచారమయింది.

ఖైదీలు తిండి గురించి వైద్య సదుపాయాల గురించి ఆందోళన చేస్తున్నారు. క్రమశిక్షణ పేరిట తరుచు తీవ్రంగా కొట్టడం తన్నడం జరుగుతున్నదని ఆరోపణ చేస్తున్నారు. ఇంటి **ఉత్తరాలు** కత్తెర పెట్టడం. పత్రికలు, పుస్తకాలు అకారణంగా **జప్తు** చేయడం జరుగుతున్నదని ఆందోళన చేస్తున్నారు ఎస్కార్ట్లు లేవనే నెపం మీద ఖైదీలను నెల నెలా కోర్టు వాయిదాలకు తీసుక వెళ్లడం లేదని ఆందోళన చేస్తున్నారు.

ఖైదీల హక్కులను సంబంధించిన ఏ నియమాన్ని జైళ్ల**లో** సక్రమంగా పాటించడం లేదు. రాజకీయంగా చైతన్యం పొందియున్న నక్సలైట్ ఖైదీలు ఏమైనా హక్కుల కోసం జైళ్లలో ఆందోళనలు చేస్తే కొట్టడం తన్నడం దూరప్రాంతాల జైళ్లకు బదిలీ చేయడం జరుగుతున్నది. అనారోగ్యం వలన, వైద్య సదుపాయం లేకపోవడం వలన, సరియైన తిండి లేకపోవడం వలన జైళ్లలో ఖైదీలు తరుచుగా చనిపోతున్నారు, నిజామాబాద్ సబ్ జైలు వంటి చిన్నజైలులోనే ఈ సంవత్సరం ముగ్గురు ఖైదీలు చనిపోయారు, జైళ్లలోని పరిస్థితులను విపులంగా పరిశీలించి ఒక నివేదిక తయారు చేయాలని, ఆ నివేదికతో పాటు జైలు నియమావళినీ వివరించి ఖైదీలకు తమ హక్కులు తెలుసుకొనే దానికి ఉపయోగపడే ప్రచురణ తీసుకు రావాలని కరీంనగర్ మహాసభ తరువాత జరిగిన ప్రథమ రాష్ట్ర **కార్యవర్గ సమావేశంలోనే** అనుకున్నాం. అన్ని జిల్లాశాఖలు తమ జిల్లాలోని జైళ్ల లో నెలకొన్న పరిస్థితుల మీద నివేదికలు పంపించాలని అనుకున్నాం. కాని అది జరగలేదు.

జైళ్లలో ఖైదీల ఆందోళనకు మద్దతుగా మనం ప్రకటనలు ఇస్తున్నాం. కొన్ని సందర్భాలలో కరపత్రాలు వేసి ప్రచారం చేసాం. మన న్యాయవాదులు కొందరు వారికి న్యాయ సహాయం చేయడానికి కృషి చేశారు. ఆందోళన సమయంలో జైళ్ల అధికారులను కలిసి మన వైపు నుండి ఒత్తిడి తెచ్చాం. జైళ్లలో ఖైదీల మరణాలపైన నిజనిర్ధారణ కమిటీలు వేసి వాస్తవాలను వెలికి తీసాము. విశాఖపట్నం జైలులో డిప్యూటీ జైలర్ గంగ అనే స్త్రీని రేప్ చేసిన సంఘటనపైన మనం అందరం కలిసి జైలు ఎదుట ధర్నా చేసి అతని మీద కేసులు పెట్టించాము. అయితే ఈ కృషి ఇంకా ఎక్కువగా జరగవలసి ఉంది. ఖైదీల హక్కుల గురించి మనం కార్యక్రమాలను మన ప్రచారంలో ఈ మహాసభ తర్వాత మరింత కచ్చితంగా పెట్టుకొని తీసుకొని రావాలి.

జీవిత ఖైదు అనుభవిస్తున్న వారిని ముందుగా విడుదల చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం 1990 లో ఒక జి. వో. జారీ చేసింది. అయితే దానిని అమలు చేయడంలో శ్రద్ధ లేకపోవడం వలన ఆ జి.వో. ను అనుసరించి విడుదల కావలసిన చాలా మంది జైళ్లలోనే మగ్గుతున్నారు. ఈ జి. వో. విషయంలో అమలు కొరకు కృషి చేయవలసి ఒక సిటిజన్ ఫోరం ఏర్పాటు చేసి రాష్ట్ర అసెంబ్లీ సభ్యులకు పంచాం, ముఖ్య మంత్రి పక్షనాయకులను కలిసి మాట్లాడాం. ఖైదీల తరపున కోర్టులలో కేసులు వేస్తున్నాం. దీనిపైనా సంతకాల సేకరణ కూడా చేయవలసి అన్ని జిల్లాల శాఖలను రాష్ట్ర కార్యవర్గం కోరింది కాని ఎవరూ చేసినట్టు లేదు.

<u>పోలీసు కస్టడిలో మరణాలు :</u>

మనం 1984 నుండి లాకప్ హత్యల విషయంలో క్రమం తప్పకుండా విషయ సేకరణ చేస్తున్నాం. ఆందోళనా చేస్తున్నాం. సగటున సంవత్సరానికి రాష్ట్రంలో 20, లేక 25 మంది పోలీసు కస్టడీలో చనిపోతున్నారు. ఈ వివిధ కాలంలో కస్టడీ మరణాల గురించి స్థానిక ప్రజాందోళనలు తరచుగా జరుగుతున్నాయి. ఆ ఆందోళనలలో మనం పాల్గొంటున్నాం. అయితే కస్టడీ మరణాల సంఖ్య కూడా పెరుగుతుంది. 1992 లో 24 మంది పోలీసు కస్టడిలో చనిపోయారు. 1993 లో ఈ మహాసభల నాటికే 30 మంది చనిపోయారు.

మనం ఒకటి రెండు మినహాయింపులలో అన్ని సంఘటనల మీద నిజనిర్ధారణ కమిటీలు వేసి విషయ సేకరణ చేసాం. పెందుర్తి (విశాఖ) నాగాయలంక (కృష్ణా జిల్లా), ధర్మవరం (అనంతపురం జిల్లా) కైకలూరు (కృష్ణా జిల్లా) ఇల్లెందు (ఖమ్మంజిల్లా) నర్సాపూర్ (మెదక్ జిల్లా) టెక్కలి (శ్రీకాకుళం జిల్లా), ఖమ్మంలలో జరిగిన లాకప్ మరణాల గురించి ఏదో ఒకమేరకు ప్రజా ఆందోళన జరిగింది. దుత్తలూరు (నెల్లూరు జిల్లా), కాకినాడ మూడవ టౌన్ (తూర్పు గోదావరి జిల్లా), కాజీపేట రైల్వే పోలీసు (వరంగల్ జిల్లా), వంటి కొన్ని సంఘటనలలో మనమే పట్టించుకొని కొంత ఆందోళన చేశాం.

మెజిస్ట్రీరియల్ విచారణలలో మనం పాల్గొనడం, మృతుల బంధువులలో, స్నేహితులతో సాక్ష్యం ఇప్పించటం జరుగుచున్నది. జిల్లా అధికారులలో మాట్లాడి మృతుల కుటుంబాలకు జీవనోపాధి కల్పించే ప్రయత్నం చేస్తున్నాం. అయితే నష్ట పరిహారం కోసం కోర్టులో కేసులు వెయ్యాలనే నిర్ణయం మటుకు అమలు కావడం లేదు. ఖమ్మం జిల్లాలో జరిగిన రెండు లాకప్ మరణాలపైన మాత్రం సివిల్ కేసులు వేసే ప్రయత్నం జరుగుతున్నది. కస్టడీ మరణాల పైన చర్యతీసుకోవాలని 1989 లో ఒక యువజన కాంగ్రెస్ నాయకుడు రాష్ట్ర హైకోర్టులో వేసిన రిట్‌పిటిషన్ ఇప్పటికే పెండింగ్‌లోనే ఉన్నది. హైకోర్టు ఆనాటి దాకా జరిగిన కస్టడీ మరణాల మీద నిర్వహించిన మెజిస్ట్రీరియల్ విచారణ నివేదికను తెప్పించుకున్నది. మృతుల వారసుల జాబితా కూడా తెప్పించుకున్నది. వాళ్ళు నష్టపరిహారం కోసం హైకోర్టులలో పిటిషన్‌లు వేసుకోవచ్చునని చెప్పింది. మనం హైకోర్టులో ఆకేసు చేస్తున్న లాయర్‌ను సంప్రదించి 1989 తర్వాత జరిగిన లాకప్ మరణాల జాబితా ఇచ్చాము. ఈ జాబితా కూడా పిటిషన్‌లో చేర్చమని అడిగాము. ఈ కేసు సఫలం కావడానికి మనం వీలయినంత కృషిచేయాలి. లాకప్ మరణాల విషయంలో క్రిమినల్ కేసులు సఫలం కావడం కష్టమైనప్పటికీ నష్ట పరిహారం ఈ మధ్య చాలా సందర్భాలలో బయటి రాష్ట్రాలలో కోర్టులు ఇస్తున్నాయి. మన రాష్ట్రంలో దీనిని మనం అనివార్యత చేయగలిగితే కస్టడీ మరణాలకు కొంతమేరకైనా అడ్డుకట్ట వేసిన వాళ్ళమవుతాము.

**కరువు :**

వర్షపాతం లేమివల్ల, నీటివసతుల సంరక్షణలోను సాగునీటి సదుపాయం కల్పించడంలోను ప్రభుత్వం నిర్లక్ష్యంవల్ల, రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో తరచుగా కరువు వస్తుంది. దక్షిణ తెలంగాణ, రాయలసీమ జిల్లాలు ఎక్కువగా కరువును అనుభవిస్తున్నాయి. అయితే ఇతర జిల్లాలలో కూడ ఒక్కొక్క ప్రాంతంలో కరువు సమస్య ఉంది.

కరువు ప్రభుత్వ విధానాలతోను గ్రామీణ సామాజిక ఆర్థిక వ్యవస్థతోనూ ముడిపడి ఉన్న విషయమేతప్ప ప్రకృతి సిద్ధమయినది కాదు. కరువు నివారణకు దీర్ఘకాలిక చర్యలు తీసుకోవడం, కరువు వచ్చినప్పుడు తాగునీరు, పశుగ్రాసం, మనుషులకు చేయడానికి పని కల్పించడం ప్రభుత్వం బాధ్యతలు. ఈవిధంగా మనం కరువును ప్రజల హక్కులకు సంబంధించిన విషయంగా అర్థం చేసుకొని కృషి చేస్తున్నాం.

1992-93 సంవత్సరంలో రాష్ట్రంలో ఒకమేరకు కరువు ఉండగా 1993లో రుతుపవనాలు చాలా వరకు విఫలం అయినాయి. 23 జిల్లాలలో 15 జిల్లాలు సగటుకంటె తక్కువ వర్షపాతం పొందాయని ప్రభుత్వమే అంటున్నది. ఈ నేపథ్యంలో వ్యవస్థాగతమయిన వివక్ష, నిర్లక్ష్యం బయట పడి కరువు రూపం తీసుకుంటాయి. మనం ఈ సంవత్సరం కరువు పీడిత ప్రాంతాలు పర్యటించి నివేదికలు ప్రకటించాము. నిర్దిష్టమైన కరువు సహాయ చర్యలకూ ఏకరువు పెట్టి ప్రభుత్వ అధికారుల దృష్టికి తెచ్చాము. కరువు పనులకు ఇన్‌చార్జి అయిన రాష్ట్ర మంత్రి దగ్గరికి మేధావుల డెలిగేషన్ తీసుకుపోయి ప్రభుత్వం చేపట్టవలసిన చర్యలగురించి మాట్లాడాము.

నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల కరువు పరిస్థితిని సమీక్షిస్తూ హైదరాబాద్‌లో సదస్సు నిర్వహించాము.

కరువును జీవించే హక్కుకు సంబంధించిన సమస్యగా గుర్తించి మనం 1984లో అనంతపురం జిల్లాలో కరువు గురించి రిపోర్టు ప్రచురించాము. సంప్రదాయిక నీటి వనరుల విధ్వంసం, నదీ జలాల వినియోగంలో ప్రాంతీయ వివక్ష, భూగర్భ జలాల సంరక్షణ విషయంలో నిర్లక్ష్యం, కరువు సహాయ చర్యలు చేపట్టక పోవడం, పశువులు వేల సంఖ్యలో కోతకు పోయే స్థితి ఏర్పడినప్పటికీ సకాలంలో పశుగ్రాసం సరఫరా చేయకపోవడం మొదలయిన లక్షణాలను ఆనాడే గుర్తించాము. అయితే ప్రస్తుత ఆర్థిక పునర్వ్యవస్థీకరణలో భాగంగా కరువు సహాయచర్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం బాగా పెరిగే ప్రమాదం ఉంది. అందువల్ల రాబోయే కాలంలో కరువు సమస్య గురించి మనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించడంలో మరింత అప్రమత్తంగా ఉండాలి.

<u>నిర్వాసితులు :</u>

ప్రభుత్వం, లేక ప్రైవేట్ పెట్టుబడి దారులు చేపట్టే నిర్మాణాలవల్ల, ప్రణాళికల వల్ల, పరిశ్రమల వల్ల కోట్లాది ప్రజలు నిర్వాసితులవుతుంటారు. ఈ నిర్వాసితుల హక్కులు ఈరోజు అంతర్జాతీయంగా ఒక ముఖ్య పౌరహక్కుల సమస్యగా ముందుకు వచ్చింది. నిర్వాసితులకు పూర్తిస్థాయి పునరావాసం కల్పించాలనేది, ప్రభుత్వం (లేక సమస్యకు బాధ్యులయిన పెట్టుబడి దారులు) దానిని తమ బాధ్యతగా తీసుకోవాలనేది; ఈ విషయంలో కనీస పౌరహక్కుల అవగాహన. ప్రస్తుతం చట్టంలో ఉన్నది మనుషుల పునరావాసం కాదు. వారి ఆస్తులకు (వారికి ఆస్తులు ఉంటే) కొంత నష్టపరిహారం మాత్రమే.

మన రాష్ట్రంలో శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితులది పెద్ద సమస్య. శ్రీశైలం ప్రాజెక్టువల్ల కర్నూలు, మహబూబ్ నగర్ జిల్లాలలో 1 1/2 లక్ష జనాభా వీధిపాలయ్యారు. వాళ్ళకు చట్టం సరిగ్గా తెలియకపోవడం వల్ల, వాళ్ళకు తెలియజెప్పడం తన బాధ్యత అని ప్రభుత్వం భావించక పోవడం వల్ల, వాళ్ళుచాలా నష్టపోయారు. ప్రభుత్వం వారి ఇళ్ళకూ భూములకూ ఇచ్చిన నామమాత్రపు నష్టపరిహారం మీదకోర్టులో పిటిషన్ వేసుకొని అదనపు నష్టపరిహారం పొందే ప్రయత్నం అనంతంగా సాగుతూనే ఉంది. కోర్టుకేసులో జాప్యం, కోర్టు మంజూరు చేసిన అదనపు నష్టపరిహారాన్ని ప్రభుత్వం చెల్లించడంలో మరింత జాప్యం, ఈ లోపల దళారీల వాటాలు లాయర్ల కమిషన్లు, ఈ జాప్యానికి తట్టుకోలేక జీవనాధారం లేక నిరాశ్రయులు కావడం - అధిక భాగం రైతులకు ఈ గతి పట్టింది. నష్ట పరిహారం సంగతి ఇట్లా ఉంటే పునరావాసం సంగతి అడగనవసరమే లేదు.

మనం 1992 ఏప్రిల్ నెలలో కర్నూలు, మహబూబ్ నగర్ జిల్లాలలో 21 ముంపు గ్రామాలు పర్యటించి నిర్వాసితుల స్థితి గతులను ప్రభుత్వ బాధ్యతా రాహిత్యాన్ని తెలుసుకున్నాము. 'వెయ్యి మెగావాట్ల చీకట్లు' అనే పేరుతో ఈ నిర్వాసితుల సమస్యగురించి ఒక ప్రచురణ తీసుకొచ్చాము. కర్నూలులో ఈ సమస్య గురించి బహిరంగ సభ నిర్వహించాము. (మహబూబ్‌నగర్ జిల్లాలో పోలీసులు అనుమతి ఇవ్వలేదు).

అప్పటికి మూడేళ్ల క్రిందనే జాతీయ స్థాయిలో పునరావాసాన్ని గురించి జరిగిన ఒక ఉన్నతస్థాయి అధికార్ల సమావేశం రూపొందించిన నియమావళిని మన ప్రచురణలో ముద్రించాము. ఆ నియమావళి ప్రకారం పునరావాసం కల్పించాలని డిమాండ్ చేసాము. ఆ డిమాండ్‌తో మహబూబ్‌నగర్ జిల్లాలో సంతకాల సేకరణ కూడా చేసాము.

ఈ మధ్యనే రాష్ట్ర ప్రభుత్వం శ్రీశైలం నిర్వాసితులకు అదనపు నష్టపరిహారం వేగంగా చెల్లించడానికి 150 కోట్ల రూపాయలు మంజూరు చేసి లోక్ అదాలత్ నెలకొల్పింది.

నల్గొండ జిల్లాలోని రాచకొండ దగ్గర 31 వేల ఎకరాల భూమిలో సైన్యం శిక్షణ కోసం ఒక ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ నెలకొల్పబోతున్నారనే దానివలన రాచకొండ పరిసరాలలో ఉన్న లంబాడా తండాల ప్రజలు నిర్వాసితులవుతారనే తెలిసి మనం వెంటనే స్పందించాము. ఆ ప్రాంతాన్ని పర్యటించి ప్రజలకు ఎంత నష్టం జరుగుతుందన్న విషయం తెలుసుకొనడానికి విషయ సేకరణ చేసాము. అక్కడ భూగర్భ జలం బాగా ఉన్న కారణంగా ఆ తండాలు సస్య శ్యామలంగా ఉన్నాయనీ అయితే ఆ భూములకు తగిన విలువ రాయించుకునే సామర్థ్యం ఆ గిరిజన రైతులకు లేని కారణంగా భూమి సేకరణము వాళ్ళు చాలా నష్టపోతారనే ప్రజలకూ అధికార్లకూ తెలియజేసాము. వాళ్ళకు దక్కే కొద్ది పాటి నష్ట పరిహారంతో వాళ్ళు తిరిగి ఇటువంటి భూములు కొనుక్కోలేరని చెప్పాము. వాళ్ళు కోల్పోయినంత భూమిని వాళ్ళకు తిరిగి ఇచ్చే పునరావాస విధానం ప్రభుత్వానికి లేదుకాబట్టి ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌ను ప్రజలకు ఆవాసయోగ్యం కాని ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేసాము. ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌కు వ్యతిరేకంగా నల్గొండలో వివిధ సంఘాలు నిర్వహిస్తున్న ఆందోళనలో మనం పాల్గొంటున్నాము. ప్రభుత్వము ఆ ఆలోచనను విరమించుకొందని కొంతసేపు, తప్పక పనులు చేస్తున్నదని కొంతసేపు అధికారులు తలాతోకా లేకుండ మాట్లాడుతున్నారు.

నిర్వాసితుల సమస్య చాలా పెద్ద సమస్య. ప్రస్తుతం దేశములో అమలవుతున్న ఆర్థిక పునర్వ్యవస్థీకరణతో పెరగబోయే సమస్యలలో నిర్వాసితుల సమస్య ఒకటి. ఈ సమస్య గురించి మరింత కృషి చేయటానికి మనం సిద్ధం కావలసి వుంటుంది.

**కాలుష్యము :**

పరిశ్రమలవలన వచ్చే కాలుష్యాన్ని గురించి మనం చాలా సీరియస్‌గా ఒక మేరకు కృషి చేస్తూనే వున్నాం. ధూళి కాలుష్యం వల్ల ప్రజల ఆరోగ్యానికి, పంటలకు చాలా నష్టం జరుగుతుంది. నీటి కాలుష్యం వలన మనుష్యులకు, పశువులకు, పంటలకు ఇంకా ప్రత్యక్షమైన నష్టం కలుగుతోంది. దీనిని నివారించటానికి వున్న చట్టాలు అవినీతి వల్ల, నిర్లక్ష్యం వల్ల, అధికారుల లాలూచీవల్ల అమలు కావటం లేదు.

కాలుష్యానికి వ్యతిరేకంగా మనం ప్రచారం చేయటమేకాక, కోర్టుల్లో కేసులు వేయాలని చాలా సార్లు అనుకొన్నాము. నల్గొండ, కృష్ణా, కడప, అదిలాబాద్ జిల్లాలలోవున్న సిమెంటు ఫ్యాక్టరీల ధూళివల్ల పరిసర గ్రామాలలో జరుగుతున్న తీవ్రమైన పంటనష్టాన్ని గురించి వివరంగా విషయసేకరణ చేసి కేసు వేద్దామనుకొన్నాము. కడపలో, అదిలాబాద్‌లో కొంత విషయ సేకరణ చేశాం. కాని మనం అనుకొన్న కార్యక్రమాన్ని పూర్తిచేయలేదు.

విశాఖపట్నంలోని హిందుస్తాన్ జింక్ ఫ్యాక్టరీవల్ల పరిసర గ్రామాలలోవున్న కాలుష్య ప్రవాహాన్ని గురించి విషయ సేకరణ, ఆందోళన కరీంనగర్ మహాసభలకంటే ముందే చేశాం. దానిమీద కేసు వేయాలన్న ప్రయత్నం సాగలేదు.

నాగార్జున సాగర్‌లో అణువిద్యుత్‌కేంద్రం నెలకొల్పే ప్రతిపాదన వచ్చినపుడు మనం దానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో చురుగ్గా పాల్గొన్నాము. ఇది కరీంనగర్ మహాసభల కంటే ముందే జరిగింది. ఆ తరువాత శ్రీకాకుళం జిల్లా తీరప్రాంతంలో అణువిద్యుత్ కేంద్రం నెలకొల్పుతారనే వార్తలు వచ్చాయి. దేశ అణువిధానానికి సంబంధించిన నిర్ణయాలన్నీ ప్రభుత్వం రహస్యంగా వుంచడంవల్ల నాగార్జున సాగర్‌లో నెలకొల్పే ఆలోచన విరమించుకొన్నారా ! లేక రెండుచోట్ల నెలకొల్పుతారా ? అనేది తెలియడం లేదు. అయితే శ్రీకాకుళంలో మటుకు భూమి సర్వేతో సహా అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనికి వ్యతిరేకంగా ఆజిల్లాలో ప్రజాందోళన ముందుకు వచ్చింది. ఆ ఆందోళనలో మనజిల్లా శాఖ కార్య కర్తలు చురుగ్గా పాల్గొంటున్నారు.

కాలుష్యం విషయంలో మందకొడిగా వున్న మన ఆచరణను మెరుగు పరచుకోవాలి.

**పత్రికా విలేకరులపైన దాడులు :-**

పాలక రాజకీయాలలో ప్రజాతంత్ర విలువలు వేగంగా దిగజారుతున్న కారణంగా పత్రికా స్వేచ్ఛ పట్ల అసహనం పెరిగింది. రాజకీయంగా బలవంతులైన వ్యక్తులు తమకు వ్యతిరేకంగా వార్తలు వ్రాసిన విలేకరులపైన దాడులు చేయడం తరచుగా జరుగుతోంది. ఈ మధ్యకాలంలో హిందూపురంలోను, కావలిలోను విలేకరులపైన జరిగిన దాడులపట్ల మనం నిరసన తెలిపాము. నిరసన సభలలో పాల్గొన్నాము.

తెలంగాణా జిల్లాలలో పత్రికావిలేకర్లను నక్సలైట్లుగా చిత్రీకరించ ప్రయత్నం ... పరిపాటి అయింది. గులాం రసూల్ హత్య గురించి ఇది వరకే ప్రస్తావించాము. ప్రజల సమస్యల గురించి, పోలీసు అత్యాచారాల గురించి వార్తలు వ్రాసే విలేకరులను ఈ రకంగా వేధింపు భయం పెడుతున్నారు. ఒక దశలో చాలా మంది విలేకరులను అరెస్టుచేసి నక్సలైట్లకు సంబంధించిన కేసులను, వాళ్లమీద పెట్టి జైళ్లలో పెట్టారు. కరీంనగర్ , మెదక్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలలోను, గుంటూరు, తూర్పు గోదావరి జిల్లాలలోను మొత్తం 8 మంది విలేకరులను ఈ రకంగా పోలీసులు కేసులలో పెట్టారు. మనం ఆ విలేకర్ల దగ్గర అఫిడవిట్లు సేకరించి 1991 ఆగస్టు 7వ తేదీన ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు పంపించాము. ప్రెస్ కౌన్సిల్ రాష్ట్ర డి.జి.పి.ని సంజాయిషీ అడిగినట్లు తెలిసింది. ఆయన ఏమి జవాబు చెప్పాడో, ప్రెస్ కౌన్సిల్ ఏమి చర్య తీసుకోదల్చుకుందో తెలియదు.

<u>రొయ్యల చెరువులు :-</u>

నూతన ఆర్థిక విధానంతో వస్తున్న మార్పులలో భాగంగా రాష్ట్ర తీరప్రాంతాలలో రొయ్యల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. నదులు, ఏరులు , సముద్రములో కలిసేచోట లభించే ఉప్పు నీరు రొయ్యల సాగుకు తగినది. రొయ్యల ఎగుమతికి మార్కెట్ బాగా వుండడంవలన విదేశీ మారక ద్రవ్యము ఆర్జనకు ప్రభుత్వము దీనినొక మార్గంగా భావిస్తున్నది. దీనితో దూర ప్రాంతాలనుండి ధనవంతులైన వ్యాపారులు వచ్చి తీరప్రాంతాలలో పేదవారి భూములు కొనుక్కొని రొయ్యల చెరువులు త్రవ్వి వ్యాపారం చేస్తున్నారు.

అంతేగాక రెవెన్యూ అధికారులు ఈ రొయ్యల సాగుదారులతో లాలూచీపడి ప్రభుత్వ భూములను యస్‌సి ,యస్‌టి లకు 'డి' ఫారమ్ పట్టాలు ఇచ్చేటట్లుచేసి బినామీగా ధనవంతులైన రొయ్యల సాగు దారులకు అప్పగిస్తున్నారు. యస్‌సి కార్పొరేషన్ యస్‌సి లకు త్రవ్వి ఇచ్చిన రొయ్యల చెరువులను బయటి వ్యాపారస్తులు లీజుకు తీసుకొని వాటి లబ్ధిదారులను కూలీవాళ్లగా పెట్టుకొని వ్యాపారం చేస్తున్నారు. ఈ రకంగా రొయ్యల సాగువల్ల తీరప్రాంత భూములు పేదలనుండి ధనవంతుల చేతుల్లోనికి పెద్ద ఎత్తున పోతున్నాయి. సంప్రదాయికంగా చేపలు, రొయ్యలు పట్టుకొని జీవిస్తున్న మత్స్యకారులు ప్రక్కకుబోయి, కోటీశ్వరులైన వ్యాపారస్తులు రొయ్యల సాగుదారులు అవుతున్నారు. దీనికి వ్యతిరేకంగా స్థానికంగా ఉద్యమాలు, ఆందోళనలు జరుగుతున్నాయి.

ఈ సమస్యగురించి సర్వేజరిపి నివేదిక తయారుచేయాలని, ఆందోళన చేస్తున్న తీరప్రాంత ప్రజలకు మద్దతునివ్వాలని నిర్ణయించుకొన్నాము. ఒంగోలు రూరల్ మండలంలో సర్వే జరిపి జిల్లా అధికారులను కలసి, పత్రికా ప్రకటన ఇచ్చాము. అంతకు మించి యీ విషయంలో వేరే కార్యక్రమము ఏదీ జరగలేదు. ఇది కొనసాగుతున్న సమస్య కాబట్టి ఇకనైన యీ కర్తవ్యాన్ని మనం సంపూర్ణంగా నిర్వర్తించాలి. నూతన ఆర్థిక విధానం ప్రజలు జీవించే హక్కుకు ఏవిధంగా భంగం కలుగజేస్తుందో. అనడానికి ఈ సమస్య ఒక తార్కాణం.

కల్తీమద్యం చావులు :-

వెల్దుకూరు, అల్వాల్‌లలో 1993 నవంబర్ నెలలో జరిగిన కల్తీమద్యం మరణాలు రాష్ట్ర ప్రజల దృష్టిని ఆకర్షించాయి. అయితే కల్తీమద్యం - చావులు మన రాష్ట్రానికి క్రొత్తకాదు. మద్యం వ్యాపారం మొత్తం రాజకీయనాయకులు తదితర ఘరానా వ్యక్తుల చేతిలో వుండటం వలనే, వాళ్ళు యధేచ్ఛగా కల్తీచేసి కోట్లరూపాయిలు గడిస్తున్నారు. వాళ్ళు ప్రజల ప్రాణాలు తీసిన అడిగే వాడులేడు. 1991 నవంబర్ ఆఖరివారంలో కడపజిల్లా కొండాపురం మండలంలో ప్రభుత్వ సారా దుకాణంలోనే విక్రయించిన దొంగసారా త్రాగి 14 మంది చనిపోయారు. ఆసారా కాంట్రాక్టరు అప్పటి హోంమంత్రి మైసూరా రెడ్డికి, అసమ్మతి నాయకుడు రాజశేఖర రెడ్డికి కావలసిన వాడే. మనంతప్ప వేరే ఎవ్వరు ఆందోళన చేయలేదు. ప్రభుత్వం న్యాయ విచారణ ఆదేశించగ మనం దానిలో పాల్గొని, మన నివేదిక ఇచ్చాము. అయితే బలవంతులైన సారా కాంట్రాక్టర్లు మృతులకుటుంబాల వాళ్ళను లొంగదీసుకొని, మృతులు ప్రభుత్వ సారాదుకాణంలో త్రాగలేదు అని, ఎవరో గుర్తు తెలియని వ్యక్తి రోడ్లో విక్రయించిన సారా త్రాగి చనిపోయారని స్టేట్‌మెంట్ ఇప్పించారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో కల్లు కల్తీవల్ల చనిపోయేవారి సంఖ్యకు లెక్కేలేదు. కల్లులో క్లోరల్ హైడ్రేటు, డైజిపామ్‌వంటి రసాయన పదార్థాలు కలిపి సహజంగా వచ్చేదానికంటే ఎన్నో రెట్లు కల్లు తయారుచేసి వ్యాపారస్తులు అమ్ముతున్నారు. ప్రతి సంవత్సరము వందలమంది చనిపోతున్నారు. ఇవి మారు మూల గ్రామాలలో ఒక్కొక్కరుగా చనిపోయే సంఘటనలు కాబట్టి ఈ మరణాల వివరాలు బయటికి రావటం కష్టం. మనం సాధ్యమైన మేరకు విషయసేకరణ చేసి గడిచిన సంవత్సర కాలంలో కల్తీకల్లు త్రాగి చనిపోయినవారి జాబితా సేకరించాలి. హైకోర్టులో కేసు వేసే ప్రయత్నంలో వున్నాము. హైదరాబాద్‌లో కూడ కల్తీకల్లు మరణాలు జరుగుతున్నాయి. 1992లో ఒకసారి 12 మంది చనిపోయారు. తరువాత కూడ అప్పుడప్పుడు చనిపోతున్నారు. ఇది రాష్ట్ర వ్యాపితంగా ఉన్న సమస్య.

సారా నిషేధాన్ని కల్తీమద్యం ద్వారా విఫలం చేసే ప్రయత్నం సారా కాంట్రాక్టర్లు చేస్తున్నారు. కల్తీసారాయి సమస్య రాబోయే రోజులలో తీవ్రంగా వుంటుంది. మనం సారా వ్యతిరేక ఉద్యమానికి మద్దతు ఇచ్చాము. మన కార్యకర్తలు కూడ వుద్యమంలో పాల్గొన్నారు. ఇప్పుడు దొంగసారాకు వ్యతిరేకంగా వుద్యమం రావలసిన అవసరం చాలా వుంది. దానికి మన పరిధిలో మనం దోహదం చేయాలి.

రాయలసీమ ముఠాదారులు :-

తుపాకులు, బాంబులు పట్టుకొని సమాజంపైన ఆధిపత్యం నెలకొల్పి వూళ్ళేలుతున్న రాయలసీమ ముఠాదారుల పెత్తనాన్ని ఒక పౌరహక్కుల సమస్యగా గుర్తించి, దానికి వ్యతిరేకంగా ప్రజలలో చైతన్యం కలిగించడానికి కృషిచేస్తున్నాము.

రాజకీయాలమీద, కంట్రాక్టులమీద, సారావ్యాపారులమీద ఆధిపత్యం నెలకొల్పిన ఈ సాయుధ ముఠాదారులు, ప్రజల ఓటు హక్కునేగాక అన్ని రంగాలలోను, ప్రజల స్వేచ్ఛను, హక్కును హరించి వేస్తున్నారు. బలవంతపు వసూళ్ళు, బలాత్కారంగా పంచాయితీలు, ప్రభుత్వ వనరుల దురాక్రమణ, ఆస్తుల స్వాధీనం, అధికార యంత్రాంగమంపై పెత్తనం మొదలైన చర్యలు పౌరహక్కుల సమస్యలుగా ముందుకు వస్తున్నాయి. ఈ ముఠాదారులు ఒకరిమీద ఒకరు బాంబుదాడులు చేసుకోవడమే కాక, తమ ఆధిపత్యాన్ని ప్రశ్నించిన వాళ్ళను చంపుతారు, కాళ్ళు చేతులు నరుకుతారు. నరికి ముక్కలు చేసి కాలువలో పడేస్తారు. ఈ ఆధిపత్యానికి పోలీసు తదితర యంత్రాంగం లొంగి పడివుండటం వలన చట్టపరంగా ప్రజల హక్కులకు వుండవలసిన రక్షణ మృగ్యమైంది.

నంద్యాల, పాణ్యం ఉపఎన్నికలలో ప్రజల రాజకీయ స్వేచ్ఛపైన ఈ ముఠాదారులు చేసిన దాడి గురించి మనం వివరంగా విషయసేకరణ చేశాం. రాజకీయ స్వేచ్ఛను కాపాడుకోమని ప్రజలలో ప్రచారం చేశాము. రెండు ఎన్నికలపైన ఓపిడిఆర్ తో కలసి కరపత్రం అచ్చువేసి, రాష్ట్రవ్యాప్తంగా పంచాము.

సాయుధ పెత్తందారీ ముఠాల ఆధిపత్యము రాయలసీమకు సంబంధించిన ఒక ముఖ్యమైన పౌరహక్కుల సమస్య. దీని విషయములో మనకృషి ఇప్పుడే ప్రారంభమయింది. ఈ మహాసభ సందర్భంగా కర్నూలు జిల్లాలో ముఠాదారుల సమస్య గురించి 'కర్నూలు పాలెగాళ్ళు' అనే పేరుతో ఒక ప్రచురణ తీసుకొస్తున్నాము. భవిష్యత్తులో మనం ఈ విషయంలో చాలా కృషిచేయవలసి వుంది.

<u>బాణామతి</u> :-

తెలంగాణా జిల్లాలో (ప్రధానంగా మెదక్ జిల్లాలోను, కొంత తక్కువ మోతాదులో రంగారెడ్డి, మహబూబ్ నగర్, నిజామాబాద్ జిల్లాలలోను) బాణామతి మీద నమ్మకం ప్రబలంగా వుంది. మంత్రగాడని, బాణామతి చేస్తున్నారని తరచుగా హత్యలు, దాడులు జరుగుతూ వున్నాయి. ఆ నమ్మకం ఆస్తితగాదాలతో, సామాజిక ఆర్థిక రాజకీయ నేపథ్యంతో ముడిపడి వుండటంతో అది కేవలం మూఢ నమ్మకమే గాక పౌరహక్కుల సమస్య అయింది.

ఒక మూఢనమ్మకంగా ప్రజలలో బాణామతి మీదవున్న విశ్వాసాన్ని పోగొట్టడానికి ప్రభుత్వం చేపట్టవలసిన చర్యలేవీ చేపట్టడంలేదు. అది ప్రజల తప్పు అన్నట్టు వదిలేస్తుంది. ఈ బాధ్యతా రాహిత్యాన్ని మనం ప్రశ్నిస్తున్నాం.

ఆస్తితగాదాలలో ప్రత్యర్థులపైన మంత్రగాడు అన్నినిందవేసి ప్రచారం చేయడం, దాడిచేసి మంత్రగాడు కాబట్టి దాడి జరిగింది అనడము తరచుగా జరుగుతోంది.

లేదా ప్రత్యర్థి మంత్రగాడు అని ప్రచారం చేస్తే ప్రజలే చంపుతారు. లేక ఆ వ్యక్తి భయపడి గ్రామం వదిలి పెట్టి వెళ్ళిపోతాడు. పాలివాళ్ళ ఆస్తి తగాదాలు తరచుగా ఈ రకంగా పరిష్కారం అవుతాయి. ఆస్తి తగాదాలలోనే కాదు, రాజకీయ ప్రత్యర్థులను, పెత్తందార్లకు ఎదురు తిరిగిన వాళ్ళను మంత్రగాడు అనేపేరు పెట్టి చంపించిన సంఘటనలు వున్నాయి. కులంపెద్దల మాటలు వినని వాళ్ళను మంత్రగాడని దాడిచేసి తరిమేసిన సంఘటనలు, చంపిన సంఘటనలు వున్నాయి. తమకు లొంగని స్త్రీని మంత్రగత్తె అని పేరుపెట్టి చంపిన సంఘటనలు వున్నాయి. ప్రజలలో మూఢనమ్మకం వుండటం, ఘర్షణ పడటం, అనుమానంతో దాడులు చేసుకోవడము, హత్యలు చేయటం, జైలుపాలు కావటం ఇదంతా కూడ గ్రామ పెత్తందార్ల ప్రాబల్యం పెంచుతుంది. వాళ్ళ జోక్యం, పంచాయితీలు, సలహాలు వుంటాయి. గ్రామాలలో ఒక భయ వాతావరణం నెలకొంటోంది. పెత్తందార్లను వ్యతిరేకించటానికి, ప్రశ్నించడానికి జనం భయపడతారు.

ఈ రకంగా మూఢనమ్మకంగా మొదలయింది పౌరహక్కుల సమస్య అయింది. దీనిగురించి వివరంగా విషయసేకరణ చేసి, పౌరహక్కుల దృక్పథంతో అవగాహన పెంపొందించుకొని ప్రచారం చేయాలనుకున్నాము. ప్రభుత్వానికి కూడ సమస్య పరిష్కారానికి నిర్దిష్టమైన సలహా ఇవ్వాలనుకొన్నాము. రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలలో ఈ విషయంలో కొంత జరిగింది. అయితే సమస్య అధికంగా వున్న మెదక్ జిల్లాలో మనకు జిల్లాశాఖ లేకపోవడం వలన రాష్ట్ర కమిటీయే బాధ్యత తీసుకొని హైదరాబాద్ నగర కార్యకర్తల సహాయంతో బాణామతి హత్యల గురించి విషయసేకరణ చేస్తోంది. మూడవవంతు పని పూర్తయింది. రాబోయే కాలంలో దీనిని పూర్తిచేయాలి. మెదక్ జిల్లా సంబంధించినంతవరకు బాణామతి అనేది ఒక ముఖ్యమైన పౌరహక్కుల సమస్య.

టైగర్ ప్రాజెక్టు :-

చిత్తూరు జిల్లాలో అడవి ఏనుగులు గ్రామాలపైనబడి పంట నాశనం చేయడాన్ని మనం గతంలో ఒక సమస్యగా చేపట్టి కృషిచేశాం. ఏనుగులదాడినుండి రైతులకు ప్రభుత్వ రక్షణ కల్పించాలని, పంటనష్టానికి ప్రాణనష్టానికి పూర్తి నష్టపరిహారం కట్టి ఇవ్వాలని ఆందోళన చేశాము. పూర్తి వివరాలు సేకరించి హైకోర్టులో కేసువేశాము. కేసు ఫైనల్ హియరింగ్‌కు వచ్చింది. ఈ లోపల ఏనుగుల దాడులు కొత్త ప్రాంతాలకు విస్తరిస్తూ పోతూ వున్నవి.

గడచిన 2 ఏళ్ళకాలంలో ఇటువంటి మరొక సమస్య మనదృష్టికి వచ్చింది. ప్రపంచబ్యాంక్ ఆర్థిక సహాయంతో కేంద్రప్రభుత్వం నల్లమల అడవులలో పులుల అభయారణ్యాన్ని ఒక దశాబ్దం క్రిందట ఏర్పాటుచేసింది. పులుల జనాభాను పెంచటానికి ప్రత్యేకమైన చర్యలు చేపట్టింది. అయితే పెరిగిన పులుల సంఖ్య వలన పరిసర గ్రామాలలోని పశువులకు ప్రాణగండం ఏర్పడింది. అడవిలో కట్టెకోసం, బంకకోసం, తునికాకు సేకరణకోసం పోయే ప్రజలు ఇప్పుడు భయపడుతున్నారు.

బాగా వెలుతురుండగానే వెనుకకు తిరిగి వస్తున్నారు. పశువులపైన పులులు దాడిచేసినప్పుడు పశువుల కాపరులు అడ్డంపోతే వారిపై దాడిచేసి పులులు చంపుతున్నాయి. కాని పులులపైన ప్రజలు దాడిచేస్తే అటవీశాఖవారు కేసులు పెడతారు.

పులులకు ప్రభుత్వం ఇచ్చిన అభయం తమకు అన్నిరకాల నష్టం కలిగిస్తోందని నల్లమల అడవుల పరిసర ప్రాంతగ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మనం సమస్యను వివరంగా పరిశీలించటానికి మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లాలలో నిజనిర్ధారణ కమిటీవేసి విషయ సేకరణ చేశాం. పత్రికా ప్రకటన చేశాం. ప్రకాశం, గుంటూరు జిల్లాలలో కూడ విషయ సేకరణ చేసి, తదుపరి చర్యగురించి ఆలోచించాలి.

<u>ఇతర రాష్ట్రాల సమస్యలు</u> :-

ఇతర రాష్ట్రాలలో పౌరహక్కుల ఉల్లంఘన గురించి మనం అప్పుడప్పుడు కరపత్రాలలో, సభలలో విచారిస్తున్నాం తప్ప ఎక్కువ కృషి చేయడం లేదు.

కాశ్మీరులో చాలా కాలంగా, చాలా ఘోరమైన సైనిక అణచివేత సాగుతోంది. మనం కరీంనగర్ మహాసభల కంటేముందు కాశ్మీరు సమస్యమీద ఒక పుస్తకం ప్రచురించాం. కాశ్మీరు సమస్య చారిత్రాత్మకనేపథ్యాన్ని ప్రభుత్వం, హిందుత్వవాదులు వక్రీకరిస్తున్న వైనాన్ని మన ప్రచారంలో తరచుగా ప్రస్తావించి విమర్శిస్తున్నాము.

1991 ఆగస్టు, 31, సెప్టెంబర్ 1 తేదీలలో హైదరాబాదులో ఓపిడిఆర్ తో కలసి నిర్వహించిన అఖిలభారత పౌరహక్కుల సదస్సుకు హాజరైన సంఘాల నిర్ణయం ప్రకారం 4 సంఘాల ఉమ్మడి నిజనిర్ధారణ కమిటీ కాశ్మీరు పరిస్థితిని అధ్యయనం చేయటానికి ఆరాష్ట్రంలో పర్యటించింది. ఏపిసిఎల్‌సి తరపున ఐలయ్య ఈ పర్యటనలో పాల్గొన్నారు. ఆ నిజనిర్ధారణ కమిటీ ప్రకటించిన నివేదికను ఇంగ్లీషులో అచ్చువేశారు.

బీహారు రాష్ట్రానికి చెందిన ఔరంగాబాద్ అదనపు సెషన్స్‌కోర్టు 1992 నవంబర్ 4వ తేదీన, 8మంది రైతాంగ కార్యకర్తలకు ఉరిశిక్ష విధించింది. వీళ్ళు వెనుకబడిన యాదవ కులానికి చెందినవారు. 1987లో వెయ్యిమంది యాదవ, దళిత కులాలకు చెందినవారు మూకుమ్మడిగా రాజపుట్ కులస్థులపైన దాడిచేసి 52 మందిని చంపిన కేసులో ఈ శిక్షపడింది. ఆదాడి మావోయిస్టు కమ్యూనిస్ట్ సెంటర్ నాయకత్వాన జరిగింది. బీహారు రాష్ట్రంలో చాలా ఏళ్ళుగా అగ్రకులాలకు చెందిన భూస్వాములు కులం ప్రాతిపదికమీద ''సేనలు'' ఏర్పాటు చేసుకొని పేదలను, దళితులను ఊచకోత కోస్తుంటే ప్రభుత్వం వారిని ఆపలేదు. పోలీసులు నక్సలైట్లను అరిగట్టే పేరిట ఆ సేనలతో కుమ్మక్కైనారు. ఆ సేనల ఆధ్వర్యంలో 38 హత్యాకాండ సంఘటనలో 212 మంది

చనిపోగా ఒక కేసులోను శిక్షపడలేదు. ఆ పరిస్థితులలో దళితులు, పేదలు ప్రతీకారం తీర్చుకున్నారు. అటువంటి ప్రతీకార హింసను పౌరహక్కుల సంఘం సమర్థించనప్పటికీ, దానికి నైతిక బాధ్యత బీహారు రాష్ట్ర ప్రభుత్వానిదనని భావిస్తోంది. ఆ 8 మందికి వేసిన ఉరిశిక్ష రద్దుచేయాలని కోరుతూ మనం సంతకాల సేకరణ చేస్తున్నాము. ఆ హత్యాకాండ వెనుకవున్న పరిస్థితులను అధ్యయనం చేయటానికి పర్యటించిన అఖిలభారత నిజనిర్ధారణ కమిటీలో ఏపిసియల్‌సి తరపున కోదండరామిరెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు. బీహారు నిర్బంధ వ్యతిరేక కమిటీ పేరిట పాట్నా హైకోర్టులో అప్పీలు వాదించటానికి మన అధ్యక్షులు కన్నాభిరాన్ గారు ఒప్పుకొన్నారు.

కార్మికులపైన దాడులు :-

మన దేశంలో ముందునుండి పెద్ద కంపెనీలోని సంఘటిత కార్మికులను మినహాయిస్తే తక్కిన కార్మికవర్గం హక్కులకు ఎటువంటి భరోసా లేదు. హైదరాబాద్ నగర పరిసరాలలోని పారిశ్రామిక కేంద్రాలలోని చిన్న, మధ్యతరహా పరిశ్రమల కార్మికుల హక్కుల అతిక్రమణ గురించి మనం మన పరిధిలో ఆందోళన చేస్తూనే ఉన్నాము. ఈ రెండేళ్లలో ఆ కర్తవ్యాన్ని కొనసాగించాము. మిగిలిన హక్కుల సంగతి అటుంచి కనీసం యూనియన్ పెట్టుకొనే హక్కుకూడ రానురాను అసాధ్యం అయిపోతున్నది. యాజమాన్యం కక్షసాధింపు చర్యలకు పోలీసు గుండాయిజం తోడయింది. కార్మికులలో ఏమాత్రం కదలిక వచ్చినా పోలీసులు రంగంలోకి దిగి కొట్టి తన్ని తప్పుడు కేసులు పెట్టి అణిచేస్తున్నారు. పటంచెరువులోని అరిస్టోలాప్స్ మహిళా కార్మికుల పైన పోలీసుల పాశవిక దాడి దీనికొక నిదర్శనం.

ఈ మధ్యకాలంలో సిఐఎస్ఎఫ్‌ను రాష్ట్రంలోని ప్రభుత్వరంగ సంస్థల 'రక్షణ' పేరిట దించి కార్మికులపైన ఒక కొత్త పారామిలిటరీ దళంగా అణచివేత కోసం వినియోగిస్తున్నారు. సింగరేణి గనులలోను (రామకృష్ణాపురం), విశాఖపట్నంలోను కార్మికులపైన సిఐఎస్ఎఫ్ దాడికి వ్యతిరేకంగా మనం ఆందోళన వ్యక్తం చేసాము.

విజయనగరం జిల్లా నెల్లిమర్ల జూట్ మిల్లు యాజమాన్యం ఎటువంటి చట్టబద్ధత లేకుండ మిల్లుకు తాళంవేసి కార్మికులను వీధిపాలు చేస్తున్నది. దీనికి వ్యతిరేకంగా నెల్లిమర్ల కార్మికులు చేసిన ఆందోళనకు మనం మద్దతు ఇచ్చాము.

నూతన ఆర్థిక విధానంతో కార్మికులపైన దాడులు బాగా పెరిగే ప్రమాదం ఉంది. రిట్రెంచ్‌మెంట్, లే ఆఫ్, లాకౌట్, మిల్లు మూసివేత ఎటువంటి అవరోధం లేకుండ చేసే అధికారం తమకు కావాలని పెట్టుబడిదారులు కోరుతున్నారు. దీనికి చట్ట రూపం ఇచ్చే ప్రయత్నం నూతన పారిశ్రామిక సంబంధాల బిల్లు ద్వారా జరుగుతూఉంది. దీనికి వ్యతిరేకంగా మనం ఆందోళన చేస్తున్నాం.

దేశంలోని అన్ని పౌరహక్కుల సంస్థలను కలుపుకొని 'నూతన ఆర్థిక విధానం - పౌరహక్కులు' అనే అంశం మీద ఉమ్మడి కార్యక్రమం చేపట్టాలని అనుకున్నాము. ఆ ప్రయత్నం జరగలేదు. ఇకనైనా చేయవలసి ఉంది.

గుంతకల్లులో మూతపడి ఉన్న స్పిన్నింగ్ మిల్ తెరవాలని కార్మికులు దీర్ఘకాలంగా ఆందోళన చేస్తున్నారు. మనం ఆ ఆందోళనలో భాగం పంచుకున్నాము. గుంతకల్లు కార్మికులకు అండగా ప్రచారం విస్తృతంగా చేసాము.

<u>వియన్నా మానవహక్కుల సదస్సు</u> :-

1993 జూన్ నెలలో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో వియన్నా నగరంలో ప్రపంచ మానవ హక్కుల సదస్సు జరిగింది. ఈ సదస్సుకు పరిశీలకులుగా హాజరుకమ్మని ఏపిసిఎల్‌సికి ఆహ్వానం వచ్చింది. మన అధ్యక్షులు కన్నాభిరాన్‌గారు, ఉపాధ్యక్షులు హరిగోపాల్‌గారు హాజరయ్యారు. ఆ సదస్సు సందర్భంగా హాజరయిన పరిశీలక సంస్థలు రెండువారాల పర్యంతం అనేక విషయాల మీద చర్చలు పెట్టుకున్నారు. భారతదేశంలో, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో నెలకొనివున్న పౌరహక్కుల పరిస్థితి గురించి మన ప్రతినిధులు వివిధ దేశాల నుండి వచ్చిన ప్రతినిధులకు వివరించి చెప్పగలిగారు.

ఈ రోజు అమెరికా ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా అమలవుతున్న ఆర్థిక పునర్వ్యవస్థీకరణ మానవ హక్కుల అతిక్రమణకు నేపథ్యం అన్న అవగాహన ప్రపంచ మానవ హక్కుల సదస్సు చర్చలలో లోపించిందని మన ప్రతినిధులు గుర్తించి ఈ విషయాన్ని వివరిస్తూ ఒక నోట్ తయారుచేసి సదస్సుకు సమర్పించారు. మానవహక్కుల సదస్సు ఏపిసిఎల్‌సి నోటీసు చర్చించి ఒక చర్చాపత్రంగా స్వీకరించింది.

<u>భారత జాతీయ మానవ హక్కుల కమీషన్</u> :-

భారత ప్రభుత్వం ఈమధ్య ఒక జాతీయ మానవహక్కుల కమీషన్‌ను నెలకొల్పుతూ ఆర్డినెన్స్ జారీచేసింది. కమీషన్‌ను నెలకొల్పిందికూడా. దానికి మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంగనాథమిశ్రను అధ్యక్షునిగా నియమించింది. ఈయన ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు స్త్రీలు సమానత్వం కోరుకోవడం దైవ నిర్ణయానికి విరుద్ధం అని ప్రకటించి ఉన్నాడు.

భారత ప్రభుత్వానికి అప్పులిస్తున్న అంతర్జాతీయ ద్రవ్యసంస్థల ఒత్తిడి ఫలితంగా ప్రభుత్వం ఈ మానవ హక్కుల కమీషన్‌ను నెలకొల్పి ఏదో చేసినట్టు చూపిస్తున్నది తప్ప ఇది ప్రజల డిమాండ్ మీద వచ్చిన ఆలోచన కాదని మనము విమర్శించాము. ఈ మానవహక్కుల సంఘానికి దోషులను శిక్షించే అధికారంగానీ నేరవిచారణ జరిపే అధికారంగానీ లేదు. కేవలం ఒక న్యాయవిచారణ సంఘానికుండే అధికారాలు మాత్రమే ఉన్నాయి. దీనివల్ల ప్రయోజనమేమీ ఉండదని మనం పత్రికాప్రకటనల్లో విమర్శించాము. సభలలో మాట్లాడాము.

మానవహక్కుల కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన చర్చలలో ప్రస్తుతం ఎక్కడా పౌరహక్కుల ఉద్యమంలో పనిచేస్తున్నవారిని సంప్రదించలేదు. కాంగ్రెస్ నాయకులు, పోలీస్ అధికార్లు, బ్యూరోక్రాట్లు కలిసి చర్చించి కమిషన్‌ను ఏర్పాటుచేసారు. రాజ్యహింసనూ బలహీనవర్గాలపైన దాడులను ప్రధాన విషయాలు చేయక 'టెర్రరిజాన్ని' ప్రధాన విషయం చేసి అదే మానవ హక్కుల సమస్య అనే దానిని ఎదుర్కొనే ప్రయత్నంలో పోలీసులు సైన్యం పాల్పడే అత్యాచారాలు చిన్న చిన్నపొరబాట్లనే అభిప్రాయం కలిగించే ప్రయత్నం మానవహక్కుల కమిషన్ ఏర్పాటులో స్పష్టంగా ఉంది.

## 'స్వేచ్ఛ'

స్వేచ్ఛ నిర్వహణలో ఆర్థిక వనరుల కొరత ప్రభావం స్పష్టంగా కనిపిస్తూవుంది. సభ్యులు చందాలు కట్టేస్తూనే ఉన్నారుకానీ ఆ రాబడి 'స్వేచ్ఛ' నిర్వహణకు సరిపోదు. అదనంగా సేకరించి పెట్టుకోవలసి వస్తున్నది.

1992 లో ఒక సంచిక వచ్చిన తరువాత 'స్వేచ్ఛ' ఆగిపోయింది. తిరిగి 1993లో రెండు నెలలకొకసారి తీసుకొని రాగలుగుతున్నాము. 1993 ఫిబ్రవరి నుండి 'స్వేచ్ఛ' నిర్వహణ రాష్ట్ర కమిటీ బాధ్యుల సమిష్టి బాధ్యత అయింది. ప్రతినెలా జరిగే రాష్ట్రకమిటీ బాధ్యుల సమావేశంలో స్వేచ్ఛ రచనాంశాలను అజెండాలో పెట్టుకొని చర్చించుకుంటున్నాము. రాసే బాధ్యత కూడ గతంలో కంటే ఎక్కువ మంది తీసుకుంటున్నారు. అయితే ఇప్పటికే చందాలనుండి వచ్చేదిచాలక అదనంగా ఖర్చుపెట్టుకోవలసి వస్తున్నది.

మాసపత్రికగా కాకున్నా ద్వైమాసికగా స్వేచ్ఛను ఇకముందట తప్పక తీసుకొస్తాము. అయితే సభ్యులు చందాలు ఎక్కువగా కట్టించే ప్రయత్నంచేయాలి.

సి

ఈ రెండు సంవత్సరాలలో సంస్థ నిర్మాణానికీ ఆగాహనకూ సంబంధించి మనం కొన్ని నిర్ణయాలు తీసుకున్నాము.

<u>ఉద్యమకారులు చేపట్టే హింసాత్మక చర్యలు</u> :-

మనం ఉద్యమించే హక్కును ఒక ముఖ్యమైన హక్కుగా భావిస్తున్నాము. అణచివేతను ఎదుర్కోవడానికీ జీవితాన్ని మెరుగు పరచుకోవడానికీ స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు సాధించుకోవడానికీ హక్కులు పొందడానికీ ఉద్యమాలు అవసరం, ఉద్యమించే హక్కు అవసరం.

ప్రజా ఉద్యమాలు రకరకాల రాజకీయ సిద్ధాంతాల వెలుగులో జరుగుతాయి. రకరకాల పంథాలు, వ్యూహాలు, ఎత్తుగడలు, అనుసరిస్తాయి. వీటి తప్పొప్పులు, సత్యాసత్యాలు నిర్ణయించే కర్తవ్యం మనదికాదు. ఏ సిద్ధాంతమయినా ఏ పోరాట పంథా అయినా అది ప్రజల జీవనాన్నీ హక్కులనూ వ్యవస్థలో ప్రజాతంత్ర అంశాలనూ ముందుకు తీసుకుపోయేటట్లయితే అది ప్రజాతంత్ర ఉద్యమంలో భాగమేనని పౌరహక్కుల సంఘం భావిస్తుంది.

ఉద్యమకారులు హింసాత్మక చర్యలకు పాల్పడినప్పుడు, హింసామార్గాన్ని ఎంచుకున్నప్పుడు మనమెందుకు ఖండించం అన్న ప్రశ్న మనకు తరచుగా వస్తుంది. సామాజిక వ్యవస్థలో అసమానత, పీడన, అణచివేత, దోపిడీ ఉండడమే ఒక హింస. ఆ హింస వ్యవస్థీకృతమయి ఉన్నప్పుడు దానిని వ్యతిరేకించే ఉద్యమకారులు హింసామార్గాన్ని అవలంబిస్తే మనం ఖండించనవసరం లేదు. సాయుధపోరాట రాజకీయాలను మనం ఒక 'హక్కు' అనకపోయినా ఒక రాజకీయ పంథాగా గుర్తిస్తాము. ఆ రాజకీయాలను ఎవరైనా ఎంచుకుంటే దానిని చట్టపరిధిలో ఎదుర్కొనే అధికారం ప్రభుత్వానికి ఉంది. అయితే 'వాళ్ళు చట్టాన్ని గుర్తించరు కాబట్టి మేము కూడ గుర్తించము' అనే వైఖరి ప్రభుత్వం అవలంబించడాన్ని మనం వ్యతిరేకిస్తాము. ఆ పోరాటంలోని రాజకీయ అంశాన్ని గుర్తించకుండ కేవలం సాయుధ చర్యలమీద చర్చపెట్టి అతివాదం, ఉగ్రవాదం, తీవ్రవాదం టెర్రరిజం అని దూషించడాన్ని మనం వ్యతిరేకిస్తాము.

ఉద్యమకారులతోనే కాదు, ప్రజలలో ఎవ్వరితోనైనా ప్రభుత్వం చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే మనం ఖండిస్తాం. పౌరులు చేసే చట్ట విరుద్ధ చర్యలను దీనితో సమానంగా చూడము. ఎందుకంటే శిక్షాస్మృతి ద్వారా, న్యాయవ్యవస్థద్వారా, పౌరులందరూ చట్టానికి జవాబు దార్లవుతారు. కానీ ప్రభుత్వం చట్టానికి జవాబుదారు అయ్యేటట్టు చూసే వ్యవస్థ ఏదీలేదు. అందువల్ల దానిని ప్రత్యేకంగా పట్టించుకొని ఆందోళన చేసే ఉద్యమంగా పౌరహక్కుల ఉద్యమం ఆవిర్భవించింది.

అయితే మనం ప్రభుత్వ హింసనేకాక కొందరు వ్యక్తుల, వర్గాల హింసను కూడ వ్యతిరేకిస్తున్నాము. భూస్వాములు, పెట్టుబడిదార్లు శ్రామికులపైన ప్రయోగించే అణచివేతను, దళితులపైన అగ్రకులాల అణచివేతను హింసను, స్త్రీలపైన పురుషుల అణచివేతను హింసను, మైనారిటీలపైన మెజారిటీ మతోన్మాదుల దాడులను వ్యతిరేకిస్తున్నాము. ఇవన్నీ వ్యవస్థీకృతమయిన పెత్తనంనుండి, ఆధిపత్యం నుండి పుట్టిన అణచివేత చర్యలు. ప్రభుత్వ యంత్రాంగం సమాజం మీద ఒక ఆధిపత్య వ్యవస్థ అయినట్టు ఆస్తి, కులం, పురుషాధిక్యత అనేవి కూడ ఆధిపత్య వ్యవస్థలు. వాటినుండి పుట్టిన హింసను మనం పౌరహక్కుల సమస్యగా భావిస్తాము. ఉద్యమ కారుల హింస అటువంటిది కాదు. అది వ్యవస్థీకృత ఆధిపత్యాన్ని వ్యతిరేకించే రాజకీయాలలో భాగంగా ప్రయోగించే హింస. దీనిని ఆధిపత్య హింసతో ఒకేగాటన కట్టడం సరియైనది కాదు.

కానీ ఉద్యమకారులు చేపట్టే హింసాత్మక చర్యలు సామాన్య ప్రజలకు లేక అమాయకులకు హాని కలిగించినప్పుడు మనం మౌనంగా ఉండగలమా ? ఈ హాని ప్రత్యక్షంగాను పరోక్షంగాను ఉంటుంది. రైళ్ళలో బస్సులలో బాంబుపెట్టి ప్రయాణీకులను చంపడం, రైలుపట్టాలు పేల్చివేయడం వల్ల రైలు ప్రమాదం జరిగి ప్రయాణీకులు చనిపోవడం మొదలయినవి ప్రత్యక్ష హింసకు తార్కాణాలు. బ్యాంకులు, బస్సుల కాల్చివేత వల్ల ప్రజలకు కలిగే నష్టం, పోలీసులను చంపడం వంటి నిర్బంధాన్ని పెంచే చర్యలకు పాల్పడడం వల్ల ప్రజలకు కలిగే అపాయం పరోక్షంగా హాని కలిగించే చర్యలు.

అదేవిధంగా, ప్రజల సమస్యలు పరిష్కరించేటప్పుడు, ప్రజలతో వ్యవహరించేటప్పుడు, ఉద్యమ కారులు అప్రజాస్వామికంగా ప్రవర్తించినట్టయితే ఇది అన్యాయం అనకుండా ఉండగలమా ?

ఈ చర్చమనకు తరచుగా వస్తూనే ఉంది. నర్రా ప్రభాకరరెడ్డి హత్య అనంతరం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ విషయాన్ని చర్చించడానికి ఒక ప్రత్యేక కార్యవర్గసమావేశం వేసుకోవాలని నిర్ణయించుకున్నాము. ఈ సమావేశం 1991 డిసెంబర్ 29న ఖమ్మంలో జరిగింది. ఆ సమావేశంలో పై సమస్యను చర్చించిన అనంతరం, ఉద్యమకారులు సామాన్య ప్రజలకూ అమాయకులకూ తీవ్రంగా హాని కలిగించే చర్యలకు పాల్పడితే ఖండించాలనుకున్నాం. ఉద్యమకారులు ప్రజలతో అప్రజాస్వామికంగా ప్రవర్తిస్తే కూడ ఖండించాలను కున్నాం. తీవ్రంగా హాని కలిగించే చర్యలకు మాత్రమే ఈ ప్రకటనలు పరిమితం కావాలనుకున్నాము. ఈ నిర్ణయాన్నీ దాని ఆవశ్యకతనూ వివరిస్తూ ఒక నోట్ తయారు చేసి అన్ని జిల్లాలకూ పంపించాము.

ఈ నిర్ణయం మీద జిల్లా స్థాయిలోకూడ చర్చజరిగాలని కార్యకర్తలు కోరగా అన్ని జిల్లాలలోనూ కార్యవర్గ సమావేశాలు నిర్వహించి చర్చించాము. జిల్లా కార్యవర్గ సభ్యులు తమ అభిప్రాయాలు, అభ్యంతరాలు చెప్పారు. ఈ చర్చను సమీక్షించుకొని డిసెంబర్ 29 నిర్ణయాన్ని పునరాలోచించుకోవడం కోసం 1992 జూలై 11న హైదరాబాద్‌లో రాష్ట్రకార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లా శాఖల కార్యవర్గ సమావేశాలలో వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో మరొకసారి విషయాన్ని చర్చించి ఈకింది నిర్ణయం తీసుకున్నాము.

(1) సామాన్య ప్రజలకు, అమాయకులకు ప్రత్యక్షంగా భౌతికహాని కలిగించే చర్యలను ఖండించడం జరుగుతుంది తప్ప పరోక్షంగా హాని కలిగించే చర్యలను (నిర్బంధాన్ని పెంచే చర్యలను, ప్రజలకు అసౌకర్యం కలిగించే చర్యలను) ఖండించడం జరగదు.

(2) ప్రజలతో ఉద్యమకారులు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే ఖండించడం జరుగుతుంది.

(3) ఈ నిర్ణయం ఏ రాజకీయ ఉద్యమం పంథాను, ఎత్తుగడలను విమర్శించడం కోసం ఉద్దేశించబడింది కాదు. రాజకీయ ఉద్యమాల విధానాలను విమర్శించడం మన పని కాదు. నిర్దిష్ట చర్యలను పౌరహక్కుల ఉద్యమం అవసరాల దృష్ట్యా ఖండించడం అవసరం అనుకున్నప్పుడు ఖండించడం మటుకే మన కర్తవ్యం.

(4) ఈ విమర్శ, లేక ఖండన, ఒక కార్యక్రమంగా లేక ఉద్యమంగా జరగదు. కేవలం మన వైఖరి తెలియజేయడం మన కర్తవ్యం.

ఈ నిర్ణయాన్ని అమలు చేసేటప్పుడు సంస్థ బాధ్యులు రాజకీయ పక్షపాతానికి అతీతంగా వ్యవహరించడం అవసరం. ప్రజల సమస్యలపైన పనిచేసే ప్రజా ఉద్యమాల పట్ల సంఘీభావాన్ని సానుభూతిని పెంపొందించుకోవడం అవసరం.

ఈ నిర్ణయాన్ని మహాసభ ఆమోదం కోసం పెట్టాలని రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది.

తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యమకారులు 'కిడ్నాప్'కు పాల్పడినప్పుడు మన వైఖరి ఏమిటన్న ప్రశ్న కూడా తరచుగా వస్తుంది. చాలాసార్లు కిడ్నాప్ అయిన వారి బంధుమిత్రుల కోరిక మేరకు కిడ్నాప్ అయిన వ్యక్తిని ఎటువంటి హాని కలిగించకుండ విడిచిపెట్టవలసిందిగా విజ్ఞప్తి చేసాము. ఎవ్వరూ మనల్ని అడగక పోయినా ఈ రకంగా విజ్ఞప్తి చేసాము. అదే సమయంలో వ్యవస్థలోని సకల ప్రజాస్వామ్య పరిష్కార మార్గాలను మూసివేయడం ద్వారా ప్రభుత్వం ఇటువంటి పరిస్థితి కల్పిస్తున్నదని విమర్శించాము.

1993 జనవరి నెలలో విశాఖపట్నం జిల్లా కొయ్యూరు దగ్గర పీపుల్స్‌వార్ వాళ్ళు ఒక ఎంఎల్ఏనీ పలువురు ప్రభుత్వ ఉద్యోగులనూ కిడ్నాప్ చేసి తమ సహచరుడి విడుదల డిమాండ్ చేసారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారం కోసం మన సహకారాన్ని కోరింది. మనం సుదీర్ఘమయిన ఆ ఘటనలో ఇరుపక్షాల మధ్య సయోధ్యకోసం ప్రయత్నించాము. మొత్తం మీద ఆ సమస్య శాంతియుతంగానే పరిష్కారమయింది. అయితే ఇటువంటి ఘటనలలో మనం జోక్యం చేసుకోవచ్చునా ? చేసుకుంటే ఏ దృక్పథంతో చేసుకోవాలి ? అనే ప్రశ్నలు సంస్థలో వచ్చాయి.

ఈ ప్రశ్నలను రాష్ట్ర కార్యవర్గం రెండుసార్లు వివరంగా చర్చించి ఈ క్రింది నిర్ణయం తీసుకుంది : 'కొండయ్యారం' వంటి కిడ్నాప్ సంఘటనలలో మనం జోక్యం చేసుకునే అవసరం అరుదుగానే వస్తుంది. అవసరం వచ్చినప్పుడు జోక్యం చేసుకోవచ్చు. అయితే ఉద్యమకారులవైపు గానీ ప్రభుత్వం వైపుగానీ కాక స్వతంత్రంగా పౌరహక్కుల సంస్థగా జోక్యం చేసుకోవాలి. మధ్యవర్తిత్వం చేసినా పౌర హక్కుల దృక్పథంతో చేయాలి. ఈ క్రమంలో ఉద్యమకారుల చర్యల గురించి మాట్లాడడం జరిగితే అది సంస్థ అవగాహనకు లోబడి ఉండాలి. ప్రత్యేకించి, కిడ్నాప్‌లను ఒక విధానంగా ఖండించడం మన పరిధిలోని విషయం కాదు. కిడ్నాప్ అయిన వ్యక్తులకు హానికలిగించకుండ విడుదల చేయమని విజ్ఞప్తి చేయడం వరకే మన కర్తవ్యం.

<u>సభ్యత్వం</u> :

ఇన్ని సంవత్సరాలు గడిచినా మనకు ఖచ్చితమయిన సభ్యత్వం జాబితా లేదు. సభ్యత్వానికి కచ్చితమయిన ప్రమాణంలేదు. దీని ఫలితంగా ఏమి జరుగుతున్నదంటే విప్లవ కమ్యూనిస్టు భావాలు ఉండేవాళ్ళు మట్టుకు సులభంగా సంస్థ సభ్యులయిపోతున్నారు. ఇతర రాజకీయ భావాలు ఉండే వాళ్ళకు పౌరహక్కుల ఉద్యమంలో పనిచేయాలని ఆసక్తి ఉన్నా సులభంగా సభ్యులు కాలేకపోతున్నారు.

పౌరహక్కుల సంఘాన్ని ఏదో ఒక్క రాజకీయ సిద్ధాంతానికి లేక పంథాకు సంబంధించిన సంస్థగా కాక విశాల ప్రజాతంత్ర వేదికగా అభివృద్ధి చేయాలన్న అవగాహనకు తగినట్టు సభ్యత్వ ప్రమాణాలను నిర్దేశించాలి. సభ్యత్వానికి కచ్చితమయిన ప్రమాణాలు ఉండాలి. ఈ విషయాన్ని రాష్ట్ర కార్యవర్గం 1993 ఏప్రిల్ 11న చర్చించి ఈ క్రింది నిర్ణయం చేసింది :

(ఎ) సంస్థకు సభ్యత్వం అనేది స్పష్టంగా ఉండాలి. అయితే ఇది ప్రస్తుతం ఉన్న నిర్మాణాన్ని క్రమబద్ధం చేసుకోవడానికి, యోగ్యతగల కొత్త సభ్యులను పరిశీలన మీదట చేర్చుకోవడానికి, ఉద్దేశించబడిందే తప్ప, సభ్యత్వాన్ని ఒక <u>కార్యక్రమంగా</u> చేపట్టడానికి కాదు. అంటే 'మెంబర్‌షిప్ డ్రైవ్' కాదు.

(బి) సభ్యత్వానికి ప్రమాణం పౌరహక్కుల పట్ల అవగాహన కనీసస్థాయిలో ఉండడం; సమాజం పట్ల ప్రజాస్వామిక వైఖరి ఉండడం; ఏదో ఒక మేరకు ఆర్థిక వనరులనూ భౌతిక శ్రమనూ ఉద్యమం కోసం వెచ్చించడానికి సిద్ధంగా ఉండడం. అంతేతప్ప పార్టీ రాజకీయాలను ప్రమాణంగా తీసుకోవడానికి వీలులేదు. ఈ విషయంలో అన్ని స్థాయిలలోని బాధ్యులు చిత్తశుద్ధితో సరయిన వైఖరినీ అవగాహననూ పెంచుకోవాలి.

(సి) కొత్తగా ఎవరికయినా సభ్యత్వం ఇచ్చేముందు కొన్నాళ్ళు ఆ వ్యక్తిని నిజనిర్ధారణ కమిటీలు డెలిగేషన్లు, మొదలయిన కార్యక్రమాలలో నియోగించి పరిశీలన మీదట జిల్లా కార్యవర్గం నిర్ణయం మేరకు సభ్యత్వం ఇవ్వాలి. సభ్యత్వానికి సంబంధించి జిల్లా కార్యవర్గం ఉమ్మడి సమ్మతి ఉండాలి.

ఓపిడిఆర్ సంస్థ సభ్యత్వం కేవలం విప్లవ రాజకీయాల సానుభూతిపరులకు పరిమితం కాకుండా విశాల ప్రజాస్వామిక ప్రాతిపదిక మీద రూపొందాలనేది చాలా ముఖ్య విషయంగా పరిగణించాలి.

పై ప్రాతిపదిక మీద సభ్యత్వం నిర్ణయించే ప్రయత్నం మొదలయింది. దానిని సమగ్రంగా పరిపూర్ణం చేయాలి.

<u>ఓపిడిఆర్ తో ఐక్యతా చర్చలు</u> :-

1973 డిసెంబర్ నెలలో గుంటూరులో జరిగిన పౌరహక్కుల సదస్సులో వచ్చిన చీలికల ఫలితంగా ఏపిసిఎల్‌సి, ఓపిడిఆర్ అనే రెండు సంస్థలు వేరువేరుగా ఏర్పడ్డాయి. ఆనాటి అనైక్యతకు విప్లవ కమ్యూనిస్టు ఉద్యమంలోని భిన్నపంథాల నేపథ్యం ఉందనేది కాదనలేని విషయం.

ఆ తరువాత రెండు దశాబ్దాలుగా రెండు సంస్థలు విడివిడిగా పనిచేస్తున్నాయి. చాలా కాలం కలిసిపనిచేసే ప్రయత్నం సహితం చేయలేదు. 1990 తరువాత మళ్ళీ కలిసి ఉమ్మడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. 1991 ఏప్రిల్‌లో జరిగిన కరీంనగర్ మహాసభలకు ఓపిడిఆర్ బాధ్యులు హాజరయ్యారు. ఉమ్మడి కార్యక్రమాలను కొనసాగించాలనే అవగాహనలో ఆచరణలో ఉన్నతేడాలను చర్చించుకోవాలనే అనుకొన్నాము. అనేక కార్యక్రమాలను ఉమ్మడిగా నిర్వహించాము. ఈ ఉమ్మడి కార్యక్రమాల వివరాలు నివేదికలో వివిధ అంశాల కింద ప్రస్తావించాము.

1992 జూలై 19న ఒకసారి, 1993 జూన్ 30న ఒకసారి మన రాష్ట్ర కార్యవర్గం తరఫున నలుగురు ప్రతినిధులు (బాలగోపాల్, బోస్, కోదండరాం, ఐలయ్య) ఓపిడిఆర్ బాధ్యులతో ఉమ్మడి కార్యక్రమాల నిర్వహణ గురించి, మన అవగాహనలో ఆచరణలో ఉన్న తేడాల గురించి చర్చించడం జరిగింది.

రెండవసారి చర్చించినప్పుడు మనం అవగాహనకు సంబంధించిన విషయాలకు ప్రాధాన్యం ఇచ్చాము. రాష్ట్రంలో పౌరహక్కుల ఉద్యమం ఒక నిర్దిష్ట రాజకీయ నేపథ్యంలో పుట్టినప్పటికీ అది ఏ ఒక్క రాజకీయ సిద్ధాంతానికే లేక ఉద్యమానికే పరిమితమయినది కాదు ; ప్రభుత్వ యంత్రాంగం, ఆస్తి, కులవ్యవస్థ, పురుషాధిక్య వ్యవస్థ మొదలయిన ఆధిపత్య వ్యవస్థలవల్ల ప్రజలపైన, ప్రజా ఉద్యమాలపైన వచ్చే అణచివేతకు వ్యతిరేకంగా పౌరహక్కుల ఉద్యమం పనిచేస్తుంది. సామాజిక రాజకీయ ఆర్థిక రంగాలలో ప్రజాస్వామ్య హక్కులనూ విలువలనూ కాపాడడానికీ పెంపొందించడానికీ కృషి చేస్తుంది. వివిధ ప్రజాతంత్ర ఉద్యమాలనుండి సిద్ధాంతాల నుండి పుట్టిన ఆలోచనలనూ విలువలనూ ఆకళింపు చేసుకొని తనదయిన అవగాహన పెంపొందించుకుంటుంది. ఈ అవగాహన ప్రాతిపదిక మీద మనం ఓపిడిఆర్ బాధ్యులతో మాట్లాడాము. వాళ్ళు తమకు మౌలికమయిన అభిప్రాయభేదం లేదనీ చిన్న విషయాలలో విభేదం ఉన్నా అది ఐక్యతకు అవరోధం కానవసరం లేదనీ అన్నారు.

ఒపిడిఆర్ రాష్ట్ర మహాసభ ఐక్యత గురించి చేసిన తీర్మానాన్ని ఆమోదిస్తున్నాం. రాబోయే రెండు సంవత్సరాలలో మరింత ఎక్కువగా కలిసి పనిచేసి ఐక్యతా ప్రయత్నాన్ని కొనసాగిస్తాము.

<u>లక్ష్య ప్రకటనలో సవరణలు</u> :-

1980 లో లక్ష్య ప్రకటనను ఆమోదించిన తరువాత మనం అనేక కొత్త సమస్యలను గుర్తించాము. అవగాహన పెంచుకున్నాము, ఆచరణ విస్తరించుకున్నాము. లక్ష్య ప్రకటనను ఆమోదించేనాటికి మనము ప్రభుత్వ యంత్రాంగాన్నీ స్వంత ఆస్తినీ పౌరహక్కుల అణచివేతకు రెండు మూలాలుగా గుర్తించాము. ఆ తరువాత మన ఆచరణద్వారా కులవ్యవస్థనూ, పురుషాధిక్య వ్యవస్థనూ మరిరెండు మూలాలుగా గుర్తించాము. సామాజిక రాజకీయ వ్యవస్థలో ప్రజాస్వామ్య విలువలను రక్షించుకునే కర్తవ్యం కూడా మన మీద ఉందని గుర్తించాము. మతోన్మాదాన్ని ప్రజాస్వామ్య విలువలకు ఒక శత్రువుగా గుర్తించాము.

హక్కుల అణచివేతకు ప్రభుత్వ రాజకీయ ఆర్థిక విధానాలు నేపథ్యంగా పనిచేస్తాయి. ఈ విధానాలు ప్రజలహక్కులపైన, జీవనంపైన ఏ ప్రభావం వేస్తాయని విశ్లేషించి స్పందించడం మన కర్తవ్యంగా గుర్తించాము.

ఈ అవగాహనకు తగినట్టు లక్ష్య ప్రకటనలో సవరణలు చేయాలని రాష్ట్ర కార్యవర్గం భావిస్తున్నది. మహాసభ ఆమోదం కోసం ఈక్రింది సవరణలు ప్రతిపాదిస్తున్నది :

(I) లక్ష్య ప్రకటనలో (ఎ) తరువాత (i ఎ) చేర్చాలి.

i ఎ. పౌర జీవితంలో ప్రజాతంత్ర వ్యవస్థకోసం, ప్రజాతంత్ర విలువల కోసం, ప్రజాతంత్ర సంస్కృతికోసం ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం కృషిచేస్తుంది. కులవ్యవస్థనూ పురుషాధిక్య వ్యవస్థనూ మతోన్మాదాన్నీ వ్యతిరేకిస్తుంది.

(II) లక్ష్య ప్రకటనలో (2) లో, 'జీవనము, స్వేచ్ఛ, సంతోషము...' అని ఉన్న చోట 'జీవనము, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక ఆర్థిక రాజకీయన్యాయము...' అని సవరించాలి.

(III) లక్ష్య ప్రకటనలో (3)లో 'భూస్వాములు, పెట్టుబడి దారులు, ప్రభుత్వ యంత్రాంగం....' అని ఉన్నచోట 'భూస్వాములు, పెట్టుబడి దారులు, అగ్రకుల శక్తులు, పితృస్వామ్య శక్తులు, ప్రభుత్వ యంత్రాంగం...' అని సవరించాలి.

ఆ వాక్యానికి కొనసాగింపుగా 'ప్రజా ఉద్యమాలను అణచివేయజూస్తే...' అని ఉన్న చోట 'ప్రజలను, ప్రజాఉద్యమాలను అణచివేయజూస్తే...' అని సవరించాలి.

నిర్మాణం :-

సంస్థ నిర్మాణాన్ని పటిష్టం చేసుకోవడానికీ సమిష్టి బాధ్యతను పెంపొందించుకోవడానికీ ఈ రెండేళ్ళలో కొంత కృషి చేశాము. సభ్యత్వం ప్రమాణాల గురించి తీసుకున్న నిర్ణయం ఈ ప్రయత్నంలో భాగమే.

అన్ని జిల్లాలలోనూ జిల్లా కార్యవర్గ సమావేశం నెలకొకసారి జరగాలనీ, కార్యక్రమాలు సమీక్షించుకోవడం, కొత్త కార్యక్రమాలు నిర్ణయించుకోవడం, రాష్ట్ర కమిటీ తీర్మానాలనూ సూచనలనూ చర్చించుకోవడమేకాక జిల్లాలోని నిర్మాణ సమస్యలను నిస్సంకోచంగా చర్చించుకోవాలనీ అనుకున్నాము.

1993 ఫిబ్రవరి నుండి రాష్ట్ర కమిటీ బాధ్యుల సమావేశం నెలకొకసారి (ప్రతినెల రెండవ శనివారం) జరుగుతూవుంది. నిర్మాణ సమస్యలు, కార్యక్రమాల అమలు చర్చించడమేకాక అత్యవసర నిర్ణయాలు చేస్తున్నది. మూడు నెలలకొకసారి (రెండవ శనివారం) రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరుగుతున్నది.

మనం అవగాహనలోనూ నిర్మాణంలోనూ విస్తృతిని సాధిస్తూ ఎదుగుతున్నాం. ఈ క్రమంలో అభిప్రాయ భేదాలతో పాటు ఇతర నిర్మాణ సమస్యలుకూడా తరచుగా తలెత్తుతాయి. ఇటువంటి సమస్యలు లేక సంక్షోభం తలెత్తినప్పుడు సంస్థ ప్రయోజనాలు దెబ్బతీసే పద్ధతిలో ఎవరూ ప్రవర్తించకూడదు. సంస్థలో ఎవరిమీద ఎవరికి విమర్శ ఉన్నా అది సంబంధిత కమిటీలో పెట్టి సమిష్టిగా చర్చించాలి. అంతేతప్ప సంస్థ నిర్మాణ సమస్యల గురించి బయట ప్రచారం చేయకూడదు.

సంస్థలో క్రమశిక్షణకు సంబంధించి మన నియమావళిలో కొన్ని అంశాలు ఉన్నాయి. పై కమిటీకి కింది కమిటీ నిబద్ధమయి ఉండాలని నియమం 8(2) అంటుంది. రాష్ట్ర కమిటీకి సభ్యులందరూ బద్ధులయి ఉండాలని నియమం 8(3) అంటుంది. సభ్యులెవరయినా సంస్థ సూత్రాలను ఉల్లంఘించినా లేక ఆశయాలకు వ్యతిరేకంగా పనిచేసినా క్రమశిక్షణ ఉల్లంఘించినా వారిని సభ్యత్వం నుండి గానీ కమిటీ నుండిగానీ రాష్ట్ర కార్యవర్గం తొలగించవచ్చునని నియమం 10 అంటుంది. అయితే ఈ రెండు సంవత్సరాల కాలంలో తూర్పుగోదావరి, కడప జిల్లా శాఖలు అంతర్గత సంక్షోభంవల్ల పూర్తిగా స్తబ్ధం అయిపోయి కోలుకోని పరిస్థితి ఏర్పడినప్పుడు జిల్లా కమిటీని రాష్ట్ర కమిటీ రద్దు చేయవచ్చునా అనే ప్రశ్న తలెత్తింది. రాష్ట్ర కార్యవర్గం ఈ విషయాన్ని చర్చించి ఆ అధికారం రాష్ట్ర కార్యవర్గానికి ఉంటుందనీ, అయితే సమస్యను కూలంకషంగా పరిశీలించి అందరికీ తమ వాదన వినిపించుకునే అవకాశం ఇచ్చిన తరువాతే నిర్ణయం తీసుకోవాలనీ తీర్మానించింది. ఇది మన నియమావళి స్పిరిట్‌కు అనుగుణమయిన నిర్ణయమేనని కార్యవర్గం భావిస్తుంది.

1992 జనవరి 25వ తేదీన శ్రీకాకుళం జిల్లాలో పీపుల్స్‌వార్ వాళ్ళు ఇద్దరు కానిస్టేబుళ్ళను కిడ్నాప్ చేసితీసుకుపోగా పోలీసులు ఏపిసిఎల్‌సి జిల్లా శాఖ అధ్యక్షుడినీ కార్యదర్శినీ తీసుకుపోయి నిర్బంధించి చంపుతామని బెదిరించారు. సంస్థకు రాజీనామా చేయమని ఒత్తిడి చేసారు. వాళ్ళిద్దరూ రాజీనామా చేయడమేకాక జిల్లా కమిటీని రద్దు చేసారు. కొంతకాలం స్తబ్దంగా ఉన్నతరువాత జిల్లా కమిటీని పునరుద్ధరించి ఇద్దరు కన్వీనర్లను నియమించాము.

తూర్పు గోదావరి జిల్లా శాఖ సమన్వయలోపం వల్ల ఒకసంవత్సరం పైగా స్తబ్దంగా ఉండింది. మన సంస్థతో సంబంధంలేని రాజకీయ విభేదాలు, సంక్షోభం కారణంగా స్తబ్దమయింది. తిరిగి ఎన్నికలు నిర్వహించి జిల్లా కమిటీని పునరుద్ధరించాము.

కడప జిల్లా శాఖకూడ అంతర్గత సంక్షోభంవల్ల, సమన్వయం పూర్తిగా విఫలం కావడం వల్ల ఒక సంవత్సరం పైగా స్తబ్దమయింది. చివరికి జిల్లా కార్యదర్శి ఆధ్వర్యంలో కొందరు కార్యవర్గ సభ్యులు సమావేశమయి అధ్యక్షురాలిని సస్పెండ్ చేసారు. రాష్ట్ర కార్యవర్గానికి ఈ విషయం తెలియ జేయను కూడ లేదు. దీనిపైన రాష్ట్ర కార్యవర్గం ఏదయినా నిర్ణయం తీసుకునే దాకా కార్యక్రమాలు సస్పెండ్ చేయమని చెపితే క్రమశిక్షణను కూడ పాటించలేదు. ఒకరిద్దరు జిల్లా కమిటీ సభ్యుల వ్యక్తిగత ప్రవర్తన గురించి కూడ తీవ్రమయిన ఆరోపణలు వచ్చాయి. ఈ స్థితిలో విషయాలను వివరంగా పరిశీలించి సంస్థప్రయోజనాలను కాపాడడం కోసం జిల్లా శాఖను రద్దు చేసాము. త్వరలో పునరుద్ధరిస్తాము.

ముగింపు :-

ఈ రెండు సంవత్సరాలలో మనం నిర్మాణాన్ని కొంతపటిష్టం చేసుకున్నాము. అవగాహనకు పనివిధానానికి నిర్మాణానికి సంబంధించిన అనేక విషయాల మీద విస్తృతంగా చర్చలు పెట్టుకున్నాము. ఈ చర్చలలో సభ్యులు, బాధ్యులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. చాలా కొత్త ఆలోచనలు ముందు కొచ్చాయి. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం.

కార్యక్రమాల అమలుకూడ ఇదేవిధంగా పురోగమించిందని చెప్పగలిగితే బాగుండేను. కానీ అది మొత్తంమీద ఎప్పటిలాగే ఉంది. ముఖ్యంగా, సంఘటనల పైన నిజనిర్ధారణచేసి ఆగిపోకుండ కర పత్రాలు, సభలు, ధర్నాలవంటి ఆందోళన కార్యక్రమాలు, వీలయితే కోర్టుకేసులు మొదలయిన రూపాలలో 'ఫాలో అప్' చేయాలన్న నిర్ణయం కొన్ని సందర్భాలలో మాత్రమే అమలవుతున్నది. కొత్తగా చేపట్టాలని నిర్ణయం తీసుకున్న విషయాలు తరచుగా నిర్ణయం స్థాయిలోనే ఉండి పోతున్నాయి. పౌరహక్కుల అవగాహన ప్రజలలోకి విస్తృతంగా తీసుకుపోవడానికి సభలు, పాదయాత్రలు, వీధి మీటింగ్‌లు పెట్టాలనుకున్నాము కానీ సభలు నిర్వహించే అలవాటు ఒకప్పటికంటే తగ్గిపోయింది. ఈ

రోజు మనకు పౌరహక్కుల అవగాహనను బాగా చెప్పగల వక్తల సంఖ్య పెరిగినప్పటికీ ఇది ఎందుకు జరుగుతున్నదో ఆలోచించాలి.

పౌరహక్కుల సంఘం హోల్‌టైం కార్యకర్తల సంస్థకాదు. అందువల్ల కార్యక్రమాల అమలుకు కొన్ని సహజపరిమితులుంటాయి. అయితే ప్రతి ఒక్కరూ తమ సమయంలో ఎంత ఎక్కువ సంస్థకోసం ఇవ్వగలరో అంత ఇస్తున్నారా, ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారా అనే విషయం ఎవరికి వారు ఆలోచించుకోవాలి. పని విధానంగురించి, అవగాహన గురించి చర్చించేటప్పుడు చూపించే ఉత్సాహం ఈ విషయంలో కూడ అందరూ చూపించాలి. అంతేకాక సమన్వయలోపం రాకుండా ఉండడానికి అందరూ కృషిచేయాలి ఒక జిల్లా కమిటీలో అందరూ కలిసిపని చేయలేకపోతే విడివిడిగా ఎవరి నిబద్ధత ఎంత ఉన్నా కార్యక్రమాలు దెబ్బతింటాయి. మనం ఒకరితో ఒకరు వ్యవహరించే తీరు., చర్చలు లేక విమర్శ పెట్టుకునే తీరు, సమన్వయాన్ని లేక స్నేహసంబంధాలను దెబ్బతీయకుండా చూసుకోవాలి.

ఇరవై ఏళ్ల చరిత్రలో మనం అనేక ఆటంకాలనూ నిర్బంధాన్నీ ఎదుర్కొన్నాం. మతోన్మాదుల చేతిలో గోపిరాజన్ననూ పోలీసుల చేతిలో రామనాథం, లక్ష్మారెడ్డి, ప్రభాకరరెడ్లను కోల్పోయాము. చాలామంది పోలీసు నిర్బంధాన్ని అనుభవించాము. ఈ రెండేళ్ల కాలంలో నెల్లూరు జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యం, రాష్ట్ర సహాయ కార్యదర్శి బస్, చిత్తూరు జిల్లా కార్యదర్శి క్రాంతి చైతన్య, శ్రీకాకుళం జిల్లా శాఖ (అప్పటి) అధ్యక్ష కార్యదర్శులు పరమేశ్వరరావు, నారాయణరావు, జంటనగరాల శాఖ కార్యదర్శి మధుసూదన రాజు, రాష్ట్రప్రధాన కార్యదర్శి బాలగోపాల్, పోలీసుదాడులకూ అరెస్టులకూ గురయ్యారు.

ఈ నిర్బంధం మనల్ని మరింత ఎక్కువ కృషిచేయడానికి ఉత్తేజితుల్ని చేయాలి. రాబోయే రోజులలో వివిధ రంగాలలో పౌరహక్కుల పరిస్థితి బాగా దిగజారే ప్రమాదం ఉంది. రెండేళ్లగా అమలుపరుస్తున్న నూతన ఆర్థిక విధానం ఫలితంగా ప్రజల జీవించే హక్కుపైన దాడి ఇప్పటికే విస్తృతంగా జరుగుతూ ఉంది. మనం సభలలో ప్రచురణలలో ఈ దాడి గురించి ప్రచారం చేస్తున్నాం. దీని పర్యవసానంగా వివిధ రూపాలలో జరుగుతున్న పౌరహక్కుల అతిక్రమణ గురించి ఆందోళన చేస్తున్నాం. ఈ కర్తవ్యం మరింత పెరగబోతుంది.

అందువల్ల మన కార్యక్రమాలను అవగాహననూ నిర్మాణ సమస్యలనూ వివరంగా చర్చించుకొని మనమీద ఉన్న బాధ్యత నిర్వర్తించడానికి సిద్ధంకావాలి. ఈ బాధ్యతను గుర్తించి మహాసభ అన్ని విషయాలనూ చర్చిస్తుందనే భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేస్తుందనే ఆశిస్తాము.